

సమస్యల తిష్ట

- తాగునీటి సమస్య మరింత తీవ్రం
- కాలువలను శుభ్రం చేసే వారే కరువు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నియోజకవర్గ పరిధిలోని సమస్యలను పరిష్కరించింది ఏకైక ప్రభుత్వం వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అని ఇటీవల కాలంలో ఆ పార్టీకి చెందిన నాయకులు పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారంలో వ్యాఖ్యలు చేస్తున్నారు. ఆ పార్టీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలకు అనుగుణంగా ఎక్కడా ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. కాలనీలో అనేక సమస్యలు తిష్ట వేసినప్పటికీ వాటిని పరిష్కరించడంలో మాత్రం వైఫల్యం చెందారు...



కాలనీలో శుభ్రం చేయకపోవడంతో కుప్పగా ఉన్న చెత్త

కర్నూలు నగరంలోని 5వ వార్డు పరిధిలో ఉన్న చిత్తారి వీధి, జమ్మిచెట్టు, కుమ్మరి వీధి, సుబ్రహ్మణ్యం మఠం వీధి, హసీనా మసీదు ప్రాంతాలు ఉన్నాయి. ఈ వార్డు పరిధిలో దాదాపుగా పదివేల మందికి పైగా జనాభా ఉన్నారు. ఈ వార్డులో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ వాటిని పరిష్కరించడంలో అక్కడ ఉన్నటువంటి స్థానిక అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ వైఫల్యం చెందారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా ఈ కాలనీలో తాగునీటి సమస్య మరింత తీవ్రమైంది. ఇప్పుడు ఒక రోజు తర్వాత మరుసటి రోజు తాగునీటిని విడుదల చేస్తున్నారు. అయితే తాగునీటిని విడుదల చేస్తున్నప్పటికీ కేవలం ఈ కాలనీలో అరగంట నుండి గంటలోపే పైపులైన్లకు తాగునీరు విడుదలవుతుంది. ఆ తర్వాత తాగునీరు పైపులైన్లకు రావడం లేదు. దీంతో కాలనీ ప్రజలు తాగడానికి గుక్కెడు నీరు దొరకక తీవ్ర అవస్థలు పడుతున్నా పట్టించుకునే వారే లేరు. ఈ ప్రాంత పరిధిలో తాగునీటికి సంబంధించినటువంటి బోర్లు ఉన్నా అవి మరమ్మతులకు గురికావడంతో సరిగ్గా పనిచేయడం లేదు. సుబ్రహ్మణ్యం మఠం వీధి సమీపంలో మహిళలకు మరియు పురుషులకు సంబంధించిన సామూహిక మరుగుదొడ్ల సముదాయానికి వాడుకునేందుకు నీరు కూడా సరఫరా కావడం లేదు. పురుషుల సామూహిక మరుగుదొడ్ల భవనానికి విద్యుత్తు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ వార్డు పరిధిలో ఉన్నటువంటి కాలనీలో డ్రైనేజీ కాలువలను సరిగ్గా శుభ్రపరచడం లేదు. కాలువలు మురికి వ్యర్థ పదార్థాలతో నిండి ఉండడంతో అక్కడ దోమలు నిల్వ అవుతున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్య పాలు కావలసిన పరిస్థితి ఉంది. ఈ కాలనీలో ఫాగింగ్ కూడా సరిగ్గా నిర్వహించడం లేదు. ఈ కాలనీలో ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ వాటిని పరిష్కరించడంలో స్థానిక కార్పొరేటర్, మున్సిపల్ అధికారులు, వైసిపి ఎమ్మెల్యే దృష్టి సారించడం లేదు. ఈ కాలనీలోని సమస్యలను పరిష్కారం కాకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



ఈ వార్డు పరిధిలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ వాటిని పరిష్కరించడంలో వైసిపి అధికార పార్టీ ఎమ్మెల్యే, కార్పొరేటర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రజలు మాత్రం సీసీ కాలువలు శుభ్రం చేయకపోవడంతో అనారోగ్య పాలు కావలసిన పరిస్థితి ఉంది. అలాగే తాగునీరు సరఫరా కూడా అంతంతమాత్రంగానే ఉంది. వీటితోపాటు స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించడం పట్ల ప్రజాప్రతినిధులు కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించలేదు. ఇప్పటికైనా ప్రధానంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి.

- ఎం నాగరాజు, సిపిఎం నగర నాయకులు.

తాగునీటికి తీవ్ర ఇక్కట్లు



ప్రస్తుతం రోజు మార్చి రోజు తాగునీటిని సరఫరా చేస్తున్నప్పటికీ అది కూడా తక్కువ సమయంలోనే సరఫరా చేస్తున్నారు. ప్రజలు తాగడానికి తాగునీరు దొరక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే డ్రైనేజీ కాలువలు సరిగ్గా శుభ్రం చేయకపోవడంతో దోమల సమస్య తీవ్రంగా ఉంది.

- రెహమాన్, చిత్తారి వీధి.

విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బంది



సామూహిక మరుగుదొడ్ల సముదాయానికి విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఇక్కడ కాలనీలోని పురుషులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అనేకసార్లు ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజా ప్రతినిధులు కార్పొరేషన్, విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదు.

- జహంగీర్, సుబ్రహ్మణ్య మఠం వీధి.

కూలీలకు వారంలోగా

వేతనాలు చెల్లించాలి

- ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



డ్వామా పీడీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలు చేయగలిగే పనులు కల్పించాలని, పని చేసిన కూలీలకు వారంలోగా వేతనాలు చెల్లించాలి, ఆరు వారాల కూలీల బకాయిలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమర్‌నాథ్ రెడ్డికి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం అందజేసింది. వినతి పత్రం అందజేసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి నారాయణతో పాటు జిల్లా నాయకులు మధు, తాండ్రపాడు సర్పంచ్ బాలపీరా ఉన్నారు. కర్నూలు జిల్లాలో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు ఉన్నందువల్ల గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు లేక గ్రామీణ పేదలు సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లారన్నారు. అక్కడ పనులు లేక తిరిగి గ్రామాలకు చేరుకుంటున్నారని, చాలా గ్రామాల్లో పనులు లేక పనులు ఉన్న గ్రామాలకు ఆటోలలో వెళ్లి తిరిగి వస్తూ ప్రమాదాలకు గురై ఆలూరు మండలం హులే బీడు గ్రామంలో ముగ్గురు మహిళలు మరణించారన్నారు. మద్దికేర మండలంలో నలుగురు మహిళలు మరణించారని, పొట్టకూటి కోసం వేరే ప్రాంతాలకు వెళుతూ ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. వ్యవసాయ కూలీలు గ్రామాల్లోనే ఉండి ఉపాధి హామీ పనులకు వెళ్లాలనుకున్నా వీరికి ఉపాధి హామీ పని దినాలు లేక కొన్ని కుటుంబాలు ఆగిపోయాయన్నారు. మరికొన్నిచోట్ల పారం పాండ్ పనులు తప్ప వేరే పనులు పెట్టడం లేదని, ఫారం పాండు పనులకు వెళ్లాలనుకున్న రైతులు ముందుకు రాకపోవడంతో ఆ పనులు కూడా జరగడం లేదన్నారు. అరకొరగా జరిగినా నేలలు గట్టిగా ఉండడంతో చేతులు బొబ్బలెక్కి వడదెబ్బకు గురవుతున్నారని, వ్యవసాయ కూలీలు చేయగలిగే పనులను కల్పించాలన్నారు. ఫారం పండ్ పనులు కాకుండా, వ్యవసాయ కూలీలు చేయగలిగే పనులను కల్పించాలన్నారు. జాబ్ కార్డు దరఖాస్తుదారులందరికీ జాబ్ కార్డులు ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీల పని ప్రదేశాల్లో, మెడికల్ కిట్లు, టెంట్‌లు, మజ్జిగ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు.

బాధిత కుటుంబానికి భువనేశ్వరి పరామర్శ

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

పాణ్యం నియోజవర్గం కల్లూరు అర్బన్ 37వ వార్డ్ ఉల్చాలా రోడ్డు సెంటర్‌కు చెందిన టిడిపి అభిమాని నరసింహులు కొన్ని నెలల క్రితం టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో మృతి చెందారు. అతని కుటుంబాన్ని శనివారం టిడిపి నాయకురాలు నారా భువనేశ్వరి పరామర్శించి వారికి భరోసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాణ్యం మాజీ ఎమ్మెల్యే టిడిపి అభ్యర్థి గౌరు చరిత రెడ్డి. టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి పాల్గొన్నారు.



భరోసా పత్రం అందజేస్తున్న భువనేశ్వరి

ఇంటింటి ప్రచారానికి

ముందస్తు సమాచారం ఇస్తే చాలు

ప్రజాశక్తి - కర్నూల్ కలెక్టరేట్

అభ్యర్థులు ఇంటింటి ప్రచార నిర్వహణకు ముందస్తు సమాచారం ఇస్తే చాలు అని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. జిల్లా కేంద్రంలో నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జిల్లా ఎస్పీ జి.కృష్ణ కాంత్ పాల్గొన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎటువంటి హింసకు, రీపోలింగ్‌కు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలను చేపట్టాలన్నారు. గంజాయి, లిక్కర్, నగదు, ఉచితాల అక్రమ రవాణాపై పటిష్టమైన నిఘా ఉంచాలని, రాష్ట్రాల సరిహద్దులు, జిల్లాల సరిహద్దుల్లో ఉండే చెక్ పోస్ట్‌లో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. నగదు జప్తు కేసులను 24 గంటల్లోనే పరిష్కరించాలని, ఇందుకై రాష్ట్ర మంతా ఒకే విధానాన్ని అనుసరించేలా త్వరలో ఎస్ఓపిని రూపొందించి కమ్యునికేట్ చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. తమ కార్యాలయం నుండి పంపించే ఫిర్యాదులపై జిల్లా స్థాయిలోనే సమగ్రమైన విచారణ జరిపి చర్యలు తీసుకున్న తదుపరి మాత్రమే నివేదిక పంపాలని ఆదేశించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్

అవస్థల 'పింఛన్'

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సామాజిక భద్రత పింఛను పొందుతున్న లబ్ధిదారులకు నేరుగా ఇళ్ల వద్దకే వెళ్లి పింఛను అందజేయాలని ప్రతిపక్షాలు కోరినప్పటికీ ప్రభుత్వం స్పందించ లేదు. సచివాలయాల వద్దనే లబ్ధిదారులకు పింఛను పంపిణీ ప్రక్రియకు ప్రభుత్వం ఆమోదముద్ర వేయడం పట్ల ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పింఛన్ల కోసం సచివాలయాల వద్ద లబ్ధిదారులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. లబ్ధిదారులకు నీడ వసతి కల్పించేందుకు ఎలాంటి టెంట్లు కానీ, తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేదు. పింఛన్ల పంపిణీ తీరుపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో బుధవారం నుంచి సామాజిక భద్రత పింఛన్ల పంపిణీని ప్రభుత్వం ప్రారంభించింది. సచివాలయాల్లోనే లబ్ధిదారులకు పింఛను మంజూరు చేయాలని కలెక్టర్‌కు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. సచివాలయాల నుంచే పింఛను పంపిణీకి చర్యలు చేపట్టారు. కేవలం అనారోగ్యంతో బాధపడేవారు, వికలాంగులకు మాత్రమే ఇంటి వద్దకు వెళ్లి పింఛను పంపిణీ చేసేందుకు ఆదేశాలు ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామ/వార్డు సచివాలయాల్లో పింఛన్ల పంపిణీని ఉదయం 6 గంటల నుంచి ప్రారంభించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఎక్కడా అమలుకు నోచుకోలేదు. ఉదయం 11 గంటల తర్వాతనే సచివాలయ సిబ్బంది అక్కడికి చేరుకొని లబ్ధిదారులకు పింఛను నగదును అందజేశారు. మండుటెండలో పింఛన్లు తీసుకుని ఇళ్లకు వెళ్లడంతో లబ్ధిదారులు కొంత అసహనానికి గురయ్యారు. సచివాలయాల వద్ద పింఛను లబ్ధిదారులు కూర్చునేందుకు అవసరమైన సీటింగ్, టెంట్లు కూడా ఏర్పాటు చేయలేదు. గంటల తరబడి లబ్ధిదారులు సచివాలయ ప్రాంగణం ఎదుటే కూర్చుని ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇంటి వద్దనే లబ్ధిదారులకు పింఛను నగదు అందజేసేలా చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి.

పది మూల్యాంకనం ప్రారంభం : పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమైంది. అనేకమంది ఉపాధ్యాయులు పలు కారణాలతో విధులు నిర్వహించేందుకు ముందుకు రాకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులైన ఉపాధ్యాయులకు తప్పనిసరిగా మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కర్నూలు నగరంలోని ఎక్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికే మూల్యాంకన నిర్వహణలో భాగంగా 598 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 99 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 200 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. ఈ మూల్యాంకనంలో భాగంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన పదో తరగతి జవాబు పత్రాలు వివరాలు ఇలా ఉన్నాయి. 1,84,267 పదో తరగతి జవాబు పత్రాలు జిల్లా కేంద్రానికి వచ్చాయి. జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియను ఈనెల 8 వరకు నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారి ఏర్పాటు చేశారు. రోజూ కేవలం 40 జవాబు పత్రాలను మాత్రమే అసిస్టెంట్ ఎగ్జామినర్ మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. అలాగే పదో తరగతి జవాబు పత్రాలను మూల్యాంకనం నిర్వహించిన ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ కూడా త్వరగా చెల్లించాలని ఉపాధ్యాయులు కోరుతున్నాయి. గతేడాది ఇంకా అనేకమంది ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ నిధులు విడుదల కాలేదని ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాలు డిఇఒ దృష్టికి తీసుకెళ్లాయి. ఆ నిధులను త్వరగా విడుదల చేస్తామని డిఇఒ హామీ ఇచ్చారు.



కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు : త్వరలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తున్న అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇడుపులపాయలో ఎపిసిసి వైఎస్.షర్మిల అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. కర్నూలు ఎంపీ స్థానానికి, నంద్యాల, నందికొట్కూరు, కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థుల పేర్లు ఖరారు చేశారు. కర్నూలు ఎంపీ స్థానానికి బివి.రాంపుల్లయ్య యాదవ్, నంద్యాల అసెంబ్లీ స్థానానికి గోపవరం గోకుల్ కృష్ణారెడ్డి, నందికొట్కూరు అసెంబ్లీ స్థానానికి తోగురు అర్థర్, కోడుమూరు అసెంబ్లీ స్థానానికి పరిగెల మురళీ కృష్ణ పేర్లను ప్రకటించారు. గోకుల్ కృష్ణారెడ్డి నంద్యాల జడ్‌పిటిసి సభ్యునిగా ఉన్నారు. ఇటీవల వైసిపి నుంచి కాంగ్రెస్‌లో చేరారు. తోగురు ఆర్థర్ నందికొట్కూరు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇటీవల వైసిపి నుంచి కాంగ్రెస్‌లోకి చేరారు. పరిగెల మురళీ కృష్ణ మాజీ ఎమ్మెల్యేగా పని చేశారు. ఇటీవల వైసిపిని వీడి కాంగ్రెస్‌లోకి చేరారు.



గడ్డివాములు కాలిన బాధిత రైతులతో టిడిపి నేత గౌరు వెంకటరెడ్డి

నన్నూరులో గడ్డివాములు దగ్ధం

బాధిత రైతులను పరామర్శించిన గౌరు వెంకటరెడ్డి

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో రైతులు ఎస్.న్యామత్ ఖాన్, అయూబ్‌ఖాన్, ఉష్మాన్ బాషాకు చెందిన 100 పైపులు , గడ్డివాములు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. టిడిపి సీనియర్ నాయకులు నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సంఘటనా స్థలాన్ని సందర్శించి రైతులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోవింద్ రెడ్డి, మండల నాయకులు పాలకొలను సుధాకర్ రెడ్డి, నన్నూరు విశ్వేశ్వర్ రెడ్డి గ్రామ నాయకులు విజయుడు శంషుద్దీన్, ఖాజామియ, సర్కార్ రాయలసీమ విద్యార్థి విభాగం జెఎసి అధ్యక్షులు శ్రీ రాములు తదితరులు పాల్గొన్నారు.



సిఆర్‌పిఎఫ్ జవానుకు ఘన నివాళి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

2010 సంవత్సరంలో మావోయిస్టు ఎదురుకాల్పుల్లో అమరుడైన సిఆర్‌పిఎఫ్ జవాన్ ... మద్దికుంట చంద్రమౌళీశ్వరరెడ్డికి శనివారం జిల్లా పోలీసులు నివాళులర్పించారు. కర్నూలు జిల్లా , ఓర్వకల్లుకు చెందిన జవాను చంద్రమౌళీశ్వర్ రెడ్డి చత్తీస్ ఘడ్ రాష్ట్రంలో దంతెవాడ జిల్లాలో మావోయిస్టుల ఎదురు కాల్పులలో 2010 ఏప్రిల్ 06న హెడ్ కానిస్టేబుల్ హోదాలో వీరమరణం పొందారు. ఓర్వకల్లు పాఠశాలలో శనివారం అమవీరునికి శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అతిథులు జవాను వీరత్వాన్ని కొనియాడారు. అమరుడైన వీర జవాను ఓర్వకల్లు మద్దికుంట చంద్రమౌళీశ్వర రెడ్డి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఓర్వకల్లు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గ్రూపు సెంటర్ సిఆర్‌పిఎఫ్ హైదరాబాద్‌వారు. కర్నూలు సివిల్ పోలీసు అడ్మినిస్ట్రేషన్ సహకారంతో విజయవంతంగా నిర్వహించారు. సిఆర్‌పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ మల్లే శివనాగరాజు, కల్లూరు ఎమ్మార్వో మునివేలు, ఓర్వకల్లు ఎమ్మార్వో నటరాజ్, ఓర్వకల్లు ఎంపిడిఒ మల్లేశ్వరి, ఓర్వకల్లు జిల్లా పరిషత్తు హై స్కూల్ రామచంద్రా రెడ్డి, జవాను ఎంసిఎం రెడ్డి భార్య సరస్వతమ్మ, ఓర్వకల్లు ఎస్ఐ ఎండి గౌస్ , గ్రామ పెద్దలు, బంధువులు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని కాపాడండి

ప్రజలకు ఎంఏ. గఫూర్ పిలుపు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

మత సామరస్యాన్ని కాపాడండని, మతోన్మాదులను 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓడించాలని అవాజ్ వ్యవస్థాపక అధ్యక్షులు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్ పిలుపునిచ్చారు. శనివారం కర్నూలు ఎమ్మెస్ ఫంక్షన్ హాల్ లో అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ప్రజలతో ఆయన మాట్లాడారు. ముస్లిం ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లిం మైనార్టీల పైన, క్రిస్టియన్ మైనార్టీల పైన, మేధావుల పైన, జర్నలిస్టుల పైన దాడులు పెరిగాయని వాటిని అరికట్టాల్సిన అవసరం నేటి భారతదేశంలో ఎంతైనా ఉందన్నారు. ప్రజలందరూ కులమతాలకు అతీతంగా మతసా మర స్యాన్ని, లౌకికతత్వాన్ని కాపాడాలన్నారు. ఎన్ఆర్‌సి,సిఎఎ పేరుతో ప్రజలకు భయో త్పాతాలు సృష్టించే ప్రయత్నం బిజెపి చేస్తున్నదని, దానికి స్థానిక రాజకీయ పార్టీలు వంత పాడుతున్నాయన్నారు. ఇది ఆంధ్ర రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యం అన్నారు. దేశంలో మనువాద రాజ్యాంగాన్ని తీసుకొని రావడం కోసం బిజెపి ఉవ్విల్లూరుతున్నదని, దానిని అడ్డుకునే అవకాశం ఈ ఎన్నికల ద్వారా ప్రజలకు వచ్చిందన్నారు. దానిని వినియోగించుకుని ప్రజలు మతోన్మాదులకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, నాయకులు అబ్దుల్ జబ్బర్ మౌలానా, ఇక్బాల్ హుస్సేన్, సుభాన్, షరీఫ్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఏ.గఫూర్, హాజరయిన అవాజ్ నాయకులు



ఇఫ్తార్ విందులో భోజనాలు వడ్డిస్తున్న గౌస్ దేశాయి



సి బెళగల్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

నిర్భయంగా ఓటేయండి: ఎస్ఐ

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలో ప్రతిఒక్కరు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఎస్ఐ తిమ్మారెడ్డి ఓటర్లకు సూచించారు. శనివారం కొత్తకోట, ఈర్లదిన్నే ముడుమాల గ్రామాల్లో ఎస్ఎస్‌బీ ఫోర్స్ సెంట్రల్ పోలీస్ లతో పురవీధుల్లో గస్తీ నిర్వహించారు. ఇక్కడే వచ్చే ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురి కావద్దని, ఎవరైనా రాజకీయ ప్రతాపాలు చూపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బిఎల్‌ఒలకు అవగాహన

ప్రజాశక్తి-మద్దికేర : ఎన్నికల నియమావళి పై బిఎల్‌ఓ లకు అవగాహన కల్పిస్తున్నట్లు తహశీల్దార్ రజాక్‌వలి తెలిపారు. మద్దికేర తహశీల్దార్ కార్యాలయంలో శనివారం బిఆర్‌ఓల సమావేశం ఏర్పాటు చేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలో 85 ఏళ్ల పైబడిన వృద్ధులు 178 మంది ఉన్నట్లు తెలిపారు. వయోవృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి బిఎల్‌ఒల సహకారంతో ఇంటి దగ్గరే ఓటు వేసేందుకు సదు పాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. మండలంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న 153 మంది ప్రభుత్వ అధికారులు వేరే మండలాలకు ఎలక్షన్ డ్యూటీకి వెళు తున్నట్లు తెలిపారు. డిటిపరమేష్, బిఎల్వోలు పాల్గొన్నారు.



బిఎల్‌ఒలకు అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్

12న పెద్దమ్మ అవ్వస్వాముల విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలం నల్లగుండ్ల లో పెద్దమ్మ అవ్వ స్వామి నూతన ఆలయాన్ని గ్రామస్తులు నిర్మించారు. ఈ ఆలయంలో పెద్దమ్మ అవ్వ స్వామి విగ్రహ ప్రతిష్ట ను ఈనెల 12న గ్రామస్తులు, వేద పండితులు చేయనున్నారు. 10 నుండి ఆలయంలో పూజా కార్యక్రమాలు ప్రారంభమై 12న పెద్దమ్మ అవ్వ స్వాముల విగ్రహ ప్రతిష్టను చేయునున్నారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్వాహకులు నిర్వహణ పనులలో నిమగ్నమై ఉన్నారు. బయట నుండి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా ప్రత్యేక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

ప్రత్యామ్నాయ విధానాల కోసం సిపిఎంను గెలిపించండి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రజా అనుకూల ప్రత్యామ్నాయ విధానాల కోసం సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని కర్నూలు సిపిఎం ఓల్డ్ టౌన్ కార్యదర్శి ఎం.రాజశేఖర్ డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామన్న కోరారు. శనివారం కొత్తపేట సిపిఎం ఇన్‌చార్జి హనీఫ్ అధ్యక్షతన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శి మాట్లాడుతూ 2014 నుండి అధికారంలో ఉన్న బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం ధరలు తగ్గించేందుకు జిఎస్‌టి చట్టం తెస్తున్నామని ప్రజలకు మాయమాటలు చెప్పి జిఎస్‌టి చట్టం వచ్చాక నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటే విధంగా పెంచారన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలు రెట్టింపు చేశారన్నారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చిన నరేంద్ర మోడీ ఉన్న ఉద్యోగాలు ఊడబీకి యువతను నట్టేట ముంచాడని, నరేంద్ర మోడీ రాజకీయ అధికారంకోసం మతాన్ని అడ్డపెట్టుకొని దేశాన్ని నిలువునా చీల్చడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడైన చంద్రబాబు నాయుడు ఇద్దరూ నరేంద్ర మోడీకి లెప్ప రైటుగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజా ద్రోహులను ఓటు అనే ఆయుధంతో ఇంటికి సాగనంపే రోజు వచ్చిందన్నారు. ఆలోచించి ఓటు వేయాలని నిరంతరం ప్రజా సమస్యలు తీసుకొని పనిచేసే, ప్రజా అనుకూల ప్రత్యామ్నాయ విధానాల కొరకు పాటుపడే సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రయోజనాల కోసం నిత్యం పాటుపడుతున్న సిపిఎం అభ్యర్థులను వామపక్ష పార్టీ అభ్యర్థులను గెలిపించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు జి రామన్న అన్నారు. శనివారం శనివారం 13వార్డులో కెయి మాదన్న నగర్, రివర్ వ్యూ కాలనీలో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. నంద్యాల సిపిఎం జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు ఎ.నాగరాజు, డివైఎఫ్ఐ నాయకులు రాఘవేంద్ర, గోవర్ధన్ పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న ఎం.రాజశేఖర్, ఎ.నాగరాజు, రామన్న

ఎంపిపిపై అవిశ్వాసానికి సన్నద్ధం

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ ఎంపిపిపి నారాయణదాసు పై ఎంపిటిసిలు అవిశ్వాస తీర్మానానికి సన్నద్ధం అయినట్లు పలువురు కొందరు ఎంపిటిసిలు తెలిపారు. పత్తికొండ మండలంలోని ఎంపిటిసి స్థానాలు 21 ఉన్నాయి. 2021లో వైసిపి నాయకుడు పోచమి రెడ్డి మురళీధర్ రెడ్డి ముఖ్య అనుచరుడు ఎంపిపి నారాయణదాసు కావడంతో ఏకాభిప్రాయంతో ఎన్నుకున్నారు. మండలంలోని ఎంపిపి గ్రాంట్ ఎంత వస్తుంది అనేది మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశంలో ఎంతవరకు పనులు చేశాం అని నివేదికలు ఇవ్వాలి. ఇప్పటివరకు ఏ ఎంపిటిసికి అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేను చేసిందే వేదం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఎంపిపిపై మండిపడుతున్నారు. సభలకు సమావేశాలకు వెళ్ళినప్పుడు ఖర్చులు అధిక భారం అవుతున్నాయని పేర్కొంటున్నారు. ఎంపిటిసిలుగా గెలిచిన పదవి ఉండి ప్రజలకు ఏమి చేయలేకపోతున్నామని, ఎలాంటి ఆదరణ పొందలేక పోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎట్టకేలకు అవిశ్వాస తీర్మానానికి సిద్ధమయ్యారు.

అభివృద్ధికి పట్టం కట్టండి

- వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి



ప్రచారం నిర్వహిస్తున్న విరుపాక్షి

ప్రజాశక్తి - ఆస్పరి

ఇచ్చిన హామీలను నెరవేర్చే వారికే పట్టం కట్టాలని వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జి, ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి కోరారు. శనివారం మండలంలోని జొహరాపురం గ్రామంలో ఆయన పర్యటించారు. ముందుగా గ్రామంలోని వైసిపి నాయకులు శాలువా కప్పి పూలమాలలు వేసి బాణసంచా కాలుస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ఆలూరు అసెంబ్లీ నుంచి తనను, కర్నూలు ఎంపీగా బివై.రామయ్యను గెలిపించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీరు లేక ఒంద్రు నీరు తాగుతున్నామని, సిసి రోడ్లు, డ్రెయినేజీ కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు విరుపాక్షి దృష్టికి తీసుకొచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వేదవతి ప్రాజెక్ట్ ద్వారా ఆస్పరి మండలానికి నీళ్లు అందించే బాధ్యత తనదని ప్రజలకు హామీ ఇచ్చారు. మండలంలో చాలా గ్రామాల్లో నీటి సమస్యతో, డ్రెయినేజీ, సిసి రోడ్లు లేక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని, త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. సంక్షేమ పథకాలు అందాలంటే జగన్మోహన్ రెడ్డిని మరోసారి ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. జెసిఎస్ జిల్లా కన్వీనర్ సురేంద్ర రెడ్డి, జడ్‌పిటిసి దొరబాబు, ఆస్పరి, చిప్పగిరి మండల కన్వీనర్లు పెద్దయ్య, మారయ్య, జిల్లా కెడిసిసి బ్యాంకు డైరెక్టర్ రాఘవేంద్ర, కోకన్వీనర్ పురుషోత్తమ రెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ బసవరాజు, శివ, సర్పంచి నెల్లూరప్ప, హరికృష్ణ, వెంకటేష్, ఎంపిటిసిలు శ్రీరాములు, రాధాకృష్ణ, నాయకులు కేశవరెడ్డి, చిన్న రెడ్డి, తిమ్మప్ప, నాగరాజు, ప్రకాష్, శివకోటి, ప్రభాకర్ పాల్గొన్నారు.

మండలంలో వైసిపి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి జయమ్మ

ప్రజాశక్తి - కౌతాళం

రాంపురం రెడ్డి సోదరుల కుటుంబం మండలంలోని మ్యాళిగనూరు, నదిచాగి గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టింది. శనివారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తరఫున ఆయన సతీమణి జయమ్మ, కుమార్తె ప్రియాంక రెడ్డి, సీతారామిరెడ్డి కుమార్తె వీణ, ప్రదీప్ రెడ్డి భార్య అనూషలు శ్రీరామలింగేశ్వర సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రెండు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి దేశంలో ఎక్కడా లేనివిధంగా పేదలకు సంక్షేమం అందించిన జగన్ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని కోరారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రతి పల్లెల్లోనూ ప్రజల కోసం నిరంతరంగా శ్రమించే శ్రామికుడు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని మరోసారి అందరూ ఆశీర్వదించి అత్యధిక మెజారిటీ గెలిపించాలని ప్రదీప్ రెడ్డి సతీమణి అనూష ఓటర్లను కోరారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదని తెలిపారు. ఇప్పుడు 'అది చేస్తాం.. ఇది చేస్తాం' అని ప్రజలను మోసం చేసేందుకు మళ్లీ అపద్దపు హామీలతో మీ దగ్గరకు రావడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు గతంలో టిడిపి ప్రభుత్వం ఎందుకు అందించలేక పోయారో టిడిపి నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలో వచ్చిన వెంటనే మళ్లీ వాలంటీర్ వ్యవస్థను కొనసాగించి అన్ని పథకాలను ఇంటి వద్దకే వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. వెంకట్ రామిరెడ్డి, నదిచాగి రామన్నగౌడ్, లింగన్న గౌడ్, మండల కన్వీనర్ దేశాయ్ ప్రహ్లాద్ స్వామి, నాగరాజ గౌడ్, ఎంపిపి అమ్రేష్, మాబుసాబ్, బుజ్జిస్వామి, వల్లూరు మర్రి గౌడ్, హాల్వి చెన్నప్ప, లింగాలదిన్నె లింగన్నగౌడ్, గురునాథ్ రెడ్డి, అవతారం, భీమేష్, పాల్ దినకరన్, తిక్కయ్య, బగ్గూర గౌడ్, జంబనగౌడ్, అనిల్, సోమశేఖర గౌడ్, బసప్ప, ముదేగౌడ్, ముదెప్పగౌడ్, ముదుకప్ప గౌడ్, నాగేష్, హనుమంతు, దేవారెడ్డి, కాంతయ్య పాల్గొన్నారు.

గొర్రెల షెడ్ దగ్ధం

- మంటల్లో కాలిపోయిన ఫర్నీచర్స్, బోరు మోటారు

- దాదాపు రూ.2 లక్షల నష్టం



ప్రమాదవశాత్తు మంటల్లో కాలిపోయిన షెడ్

ప్రజాశక్తి - చిప్పగిరి

పొట్టేళ్లు పెంచుకోవడానికి నిర్మించిన షెడ్ ప్రమాదవశాత్తు మంటల్లో కాలిపోయిన సంఘటన శనివారం చిప్పగిరిలో చోటు చేసుకుంది. చిప్పగిరికి చెందిన సురేష్ రెడ్డికి సంబంధించిన షెడ్‌లో గతంలో పొట్టేళ్లు పెంచేవారు. షెడ్‌లో పొటేళ్ల కోసం ఉంచిన మేత, ఫర్నీచర్స్, బోరు నీళ్లు విడిచే మోటారు మొత్తం మంటల్లో కాలిపోయాయి. పక్కనే ఉన్న గుంతకల్ పట్టణానికి చెందిన అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకొని రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ సూచించారు. శనివారం పట్టణంలోని ఇంద్రనగర్ కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. రామాలయం దేవాలయ సమీపంలో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు వచ్చిన వారు ఇంకా నమోదు చేసుకోకపోతే ఈనెల 16 వరకు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఓటరుగా నమోదు చేసుకుని ఓటు హక్కును వినియోగించాలని సూచించారు. బాధ్యతను విస్మరిస్తే, హక్కును అడగడం కూడా కోల్పోతామని తెలిపారు. బంగారు భవిష్యత్తు కోసం



ర్యాలీని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్

ప్రగతి వైపు నడక సాగించాలంటే బాధ్యతను గుర్తు చేసుకొని, పెద్ద శాతంలో ఓటింగ్ నమోదు చేయాలని కోరారు. కొన్ని రాష్ట్రాల్లో 85, 86 శాతం పోలింగ్ జరిగిందని, ఇక్కడ కూడా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఓటు వేసే అనుకూలమైన వాతావరణం ప్రతి పోలింగ్ కేంద్రంలో కల్పిస్తామని చెప్పారు. ఓటర్లు బాధ్యతగా బయటకు వచ్చి ఓటు వేయాలనే విషయాన్ని ప్రజలందరికీ చేరవేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తహశీల్దార్ హసీనా సుల్తానా, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఐసిడిఎస్ సిడిపిఒ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

రూ.2.50 లక్షల విలువ గల

ఆభరణాలు అందజేత

- ఆటో డ్రైవర్‌కు సిఐ హనుమంతప్ప అభినందన

ప్రజాశక్తి - ఆస్పరి

రూ.2.5 లక్షల విలువ ఆభరణాలను బాధిత మహిళకు అందజేశారు. ఆటోడ్రైవర్ బ్రహ్మయ్య నిజాయితీని సిఐ హనుమంతప్ప మెచ్చుకున్నారు. వివరాలిలా ఉన్నాయి... పుట్టినిల్లు అయినా ఆస్పరికి ఉగాది పండగ కోసం శనివారం ఉదయం ఎమ్మిగనూరు మండలం దేవి బెట్టకు చెందిన శోభ ఆదోని కొత్తబస్టాండ్‌కు వచ్చారు. ఆస్పరి వెళ్లేందుకు చిరుమాన్‌దొడ్డికి చెందిన బ్రహ్మయ్య ఆటోలో ఎక్కారు. ఆదోని నుంచి ఆస్పరికి వచ్చే ఆటోలో రూ.2.50 లక్షల విలువైన బంగారు ఆభరణాల హ్యాండ్ బ్యాగ్‌ను మరిచి తన పిల్లలతో పాటు ఆస్పరిలో దిగారు. శోభ హ్యాండ్ బ్యాగ్‌ను ఆటో డ్రైవర్ బ్రహ్మయ్య ఆస్పరి పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. ఆస్పరి సిఐ ఆభరణాలు పోగొట్టుకున్న మహిళ వివరాలను తెలుసుకొని సదరు మహిళను పోలీసు స్టేషన్‌కు పిలిపించారు. ఆమె సమక్షంలో బ్యాగ్‌ను పరిశీలించగా.. రూ.2.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్‌ను సిఐ హనుమంతప్ప, ఎఎస్‌ఐ ప్రాణేశ్వర్ సమక్షంలో మహిళకు అందజేశారు. ఆటో డ్రైవర్‌ను ఎంత పొగిడినా తక్కువేనని సిఐ తెలిపారు. నిజాయితీని చాటుకున్న ఆటో డ్రైవర్ బ్రహ్మయ్యకు ప్రోత్సాహకంగా సిఐ హనుమంతప్ప రూ.2 వేలు అందజేశారు.



పోలీసుల సమక్షంలో మహిళకు బ్యాగును అందజేస్తున్న ఆటో డ్రైవర్

తల్లి గెలుపు కోసం... తనయుని ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - నందవరం

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక గెలుపు కోసం ఆమె తనయుడు, వైసిపి యువ నాయకులు బుట్టా ప్రతుల్ ఇంటింటికీ వెళ్లి ప్రచారం మొదలు పెట్టారు. శనివారం గురజాల గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలు అందించి, కరోనా సమయంలో ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా.. కుటుంబాలు కాలం గడిపే విధంగా చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కిందని తెలిపారు. ఆయన సారథ్యంలోనే తన తల్లి బుట్టా రేణుక ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ మీ ఇంటి ఆడపడుచుగా భావించి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సర్పంచి వీరాస్వామి, వైసిపి నాయకులు శివారెడ్డి గౌడ్, విరుపాక్షి రెడ్డి, రామ్ కోటిరెడ్డి, నరసింహా రెడ్డి, రాజారెడ్డి, జాన్, వెంకటేశ్వర రెడ్డి, పెద్ద నరసింహులు, చాంద్, రామలింగడు, పరమేష్, హనుమంతు, నరసింహులు పాల్గొన్నారు.



వైసిపికి ఓటు వేయాలని అడుగుతున్న ప్రతుల్

వాలంటీర్ల మూకుమ్మడి రాజీనామా

ప్రజాశక్తి - కోసిగి

రాష్ట్రంలో ఎన్నికల సమయంలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పార్లమెంట్ ఎన్నికలతో పాటు రాష్ట్ర అసెంబ్లీకి జరుగుతున్న ఈ ఎన్నికలపై పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఎన్నికలు ముగిసే వరకు వాలంటీర్లు పింఛన్లు, రేషన్ బియ్యం పంపిణీలో పాల్గొనవద్దని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. అసహనం వ్యక్తం చేస్తున్న వాలంటీర్లు ఒక్కసారిగా రాజీనామాలు చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో వాలంటీర్లు ఎక్కడా ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ఏ పార్టీకి పని చేయకూడదని ఈసీ ఆదేశించింది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వాలంటీర్లపై కూడా నిఘా పెట్టినట్లు తెలిపింది. ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలనుకునే వాలంటీర్లు మొత్తం రాజీనామాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 1500లకు పైగా వాలంటీర్లు రాజీనామా చేయగా శనివారం కోసిగి మండలంలో 12 మంది వాలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. వారి రాజీనామా పత్రాలను ఎంపిడిఒ కార్యాలయంలో ఎఒ సిరాజ్ దౌలాకు అందజేశారు. అలాగే అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌ను మళ్లీ గెలిపించేందుకు, మంత్రాలయం ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డి గెలుపు కోసం తాము కృషి చేస్తామని చెప్పారు.



రాజీనామా పత్రాలను అందజేస్తున్న వాలంటీర్లు

టిడిపి జెండా ఎగురవేద్దాం

- టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మంత్రాలయం పీఠంపై టిడిపి జెండా ఎగురవేసేందుకు కలిసికట్టుగా పని చేద్దామని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి, తెలుగు రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, టిడిపి మహిళా అధ్యక్షులు అరుణమ్మ, మహిళా జిల్లా ఉపాధ్యక్షులు నరవ శశిరేఖ, జిల్లా నాయకులు సుభాష్ కోరారు. శనివారం మండలంలోని చిన్నతుంబళం గ్రామంలో 'జయహో బీసీ' టిడిపి మండల అధ్యక్షులు బసలదొడ్డి ఈరన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మంత్రాలయం నియోజకవర్గంగా ఏర్పాటయిన నాటి నుంచి మొదటిసారి ఎమ్మెల్యే టికెట్ బీసీలకు కేటాయించారని, టిడిపి అధినేత చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రాలయం ఎమ్మెల్యే టికెట్ బీసీలకు కేటాయించడంతో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి వణుకు మొదలైందని చెప్పారు. బయటకు మాత్రం టిడిపి అభ్యర్థి పోటీ కాదని చెబుతున్నారని అన్నారు. టిడిపి నాయకులు మల్లికార్జున, వీరేష్ గౌడ్, తలారి అంజి, నరసింహులు, శివ, చంద్ర, బిజెపి నాయకులు పురుషోత్తం గౌడ్, జనసేన మండల నాయకులు గణేష్ పాల్గొన్నారు.



పెద్దకడబూరులో మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

పురుషోత్తం రెడ్డిని కలిసిన రాఘవేంద్ర రెడ్డి

మంత్రాలయం : హైకోర్టు న్యాయవాది, బిజెపి నియోజకవర్గ నాయకులు బి.పురుషోత్తం రెడ్డిని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రాఘవేంద్ర రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. టిడిపి, బిజెపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉన్న ఆయన శనివారం మండలంలోని కలుదేవకుంట గ్రామ సమీపంలో ఉన్న బిజెపి కార్యాలయంలో కలుసుకుని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన కూడా రాఘవేంద్ర రెడ్డికి పూలమాల వేసి అభినందించారు. రానున్న ఎన్నికల్లో తన గెలుపు కోసం కృషి చేయాలని, సహాయ, సహకారాలు అందించాలని రాఘవేంద్రరెడ్డి పురుషోత్తం రెడ్డిని కోరారు. పార్టీ అధిష్టానం ఆదేశాలను అనుసరించి రాఘవేంద్ర రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి, బిజెపి నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.



పురుషోత్తం రెడ్డితో మాట్లాడుతున్న రాఘవేంద్ర రెడ్డి



ఆధునిక యంత్రాలను ప్రారంభిస్తున్న రేణు వర్గీస్

ఆధునిక పద్ధతిలో సేవలు

- మన్నికకు మారు పేరు.. ఎంఆర్ఎఫ్ టైర్

- సేల్స్ జనరల్ మేనేజర్ రేణు వర్గీస్

ప్రజాశక్తి - ఆదోని

వాహనదారులకు టెక్నాలజీతో కూడిన నాణ్యమైన టైర్లను అందించడమే ఎంఆర్ఎఫ్ ఉద్దేశమని ఆ కంపెనీ జనరల్ మేనేజర్ రేణు వర్గీస్, జిల్లా మేనేజర్ జగదీష్ రావు వివరించారు. శనివారం పట్టణంలోని నిర్మల్ థియేటర్ సమీపంలో రాయల్ ట్రేడర్స్ వరల్డ్ షో రూమును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశవ్యాప్తంగా 925 ఎంఆర్ఎఫ్ బ్రాంచిలలో వాహనదారులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కంపెనీ సేవలు అందిస్తోందని తెలిపారు. టైర్ల విక్రయంతోపాటు ఫిట్టింగ్ వంటి సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. తమ సేవలకు మెచ్చి జెడి పవర్ అవార్డును కూడా అందుకున్నామని తెలిపారు. టైర్లు మన్నిక రావాలంటే నైట్రోజన్ వాయువు గాలి ద్వారా పట్టించడం వల్ల టైర్లు కూల్‌గా ఉంటాయని వాహనదారులకు సూచించారు. ఆధునిక యంత్రాలతో వాహనదారులకు నాణ్యమైన సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆదోనిలో ఎంఆర్ఎఫ్ కంపెనీ సహకారంతో రాయల్ ట్రేడర్స్ వరల్డ్ షో రూమ్ ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందించే దిశగా పని చేస్తామని షోరూం పార్ట్నర్ ఈశ్వర్ తెలిపారు.

టైప్ రైటింగ్‌లో ప్రతిభ

ప్రజాశక్తి - ఆదోని



ఆదోనిలోని హర్ష టైప్ రైటింగ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన విద్యార్థి యు.విష్ణు పేపర్-1లో 94/100, పేపర్-2లో 95/100 మార్కులతో ఆదోని టౌన్ సెకండ్ టాపర్‌గా, ఎం.శిరీష పేపర్-1లో 96/100, పేపర్-2లో 90/100 మార్కులతో ఆదోని టౌన్ మూడో టాపర్‌గా నిలిచారని ఇనిస్టిట్యూట్ కరస్పాండెంట్ బి.మనోహర్ బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. టైప్ రైటింగ్ ఇనిస్టిట్యూట్ స్థాపించిన రెండేళ్లలోనే 98 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు.

వైసిపిలోనే ముస్లింలకు పెద్దపీట

- కోఆప్షన్ సభ్యులు సర్వర్ ఖాన్

ప్రజాశక్తి - చిప్పగిరి



గతంలో పరిపాలన చేసిన వారందరూ ముస్లింలకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని, జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే ముస్లిం, మైనార్టీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని చిప్పగిరి కోఆప్షన్ సభ్యులు సర్వర్ ఖాన్ తెలిపారు. శనివారం ఆయన చిప్పగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మతతత్వ బిజెపితో టిడిపి జతకట్టడం శోచనీయమన్నారు. ప్రాంతీయ పార్టీలను అణువణువునా బిజెపి పెద్దలు కుతంత్రాలతో బెదిరించి వారి పార్టీలోకి నాయకులను చేర్చుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. బిజెపి పరిపాలనలో ఏ రాష్ట్రం కూడా లబ్ధి పొందలేదన్నారు. వారికి ఓటు శాతం లేని రాష్ట్రాల్లో కూడా పాగా వేయడానికి సిద్ధమయ్యారని, ప్రజలు మాత్రం అన్ని ఆలోచన చేసి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ముస్లిం, మైనార్టీలను అక్కున చేర్చుకున్న వైసిపికి అందరం కూడా అండగా నిలబడి వైసిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వైసిపి పరిపాలనలో ప్రతి గడపకూ లబ్ధి చేకూరిందని తెలిపారు.

విధుల పట్ల అప్రమత్తత అవసరం

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీ

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్నికల సంఘం, కలెక్టర్ అప్పగించిన బాధ్యతల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.మురళీ ఆదేశించారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వివిధ టీములకు సంబంధించిన సెక్టోరల్ అధికారులు, వివిధ టీం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటులో జాప్యం చేయవద్దని సూచించారు. అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలిన కోరారు. ప్రచారం కోసం సువిధ యాప్ ద్వారా అనుమతులు పొందిన వివిధ పార్టీల నాయకుల వెంట తప్పనిసరిగా వీడియో సర్వ్ లెన్ టీం ఉండాలని సూచించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీం సభ్యులు అభ్యర్థుల ఖర్చుల విషయంలో నిఘా ఉంచాలని తెలిపారు. వివిటి టీం, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతర వాహనాల సోదాలు నిర్వహించాలని చెప్పారు. ఎన్నికల తాయిలాల పంపిణీ, మద్యం, డబ్బు పంపిణీపై దృష్టి సారించాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తున్న వారిపై ఎన్నికల సంఘం కఠిన చర్యలకు వెనుకాడదని హెచ్చరించారు. బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించి మన్ననలు పొందాలని సూచించారు. తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, ఇడిటి గురురాజరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని తిరుమల నగర్‌లో ఉన్న అమరావతి ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శనివారం ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. చిన్నారులందరికీ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అమరావతి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ గుడిసె రామకృష్ణ మాట్లాడారు. చిన్నారుల్లో దాగి ఉన్న నైపుణ్యం వెలికి తీసి, ప్రతిభ చాటేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. పిల్లలు విద్యాభివృద్ధి సాధించాలంటే తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయులు విద్యార్థుల చేత సాధన చేయించాలని సూచించారు. కేవలం విద్యను అభ్యసించడమే కాకుండా అబాకస్, కరాటే, యోగా, భగవద్గీత శ్లోకాలు, డ్యాన్స్ లాంటి కార్యక్రమాల్లో పిల్లలు పాల్గొనాలని కోరారు. దీనివలన పిల్లల్లో మానసికంగా, శారీరకంగా ఎదుగుదల ఉంటుందని సూచించారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

- టిడిపితోనే అభివృద్ధి

- టిడిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్ర గౌడ్

ప్రజాశక్తి- దేవనకొండ

రాష్ట్రంలో ఐదేళ్ల వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని టిడిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్ర గౌడ్ విమర్శించారు. శనివారం దేవనకొండలోని లక్ష్మీరంగ కల్యాణ మండపంలో టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి ప్రభుత్వ హయాంలో హంద్రీనీవా ద్వారా పందికోన రిజర్వాయర్ నుంచి దేవనకొండ మండలానికి 32 వేల ఎకరాలకు సాగునీరు అందించినట్లు తెలిపారు. వైసిపి పాలనలో ఇసుక మాఫియా, మద్యం మాఫియా రాజ్యమేలాయని విమర్శించారు. రాష్ట్రంలో 140 నుంచి 150 సీట్లతో ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఎన్‌డిఎ కూటమితో జతకట్టామని పేర్కొన్నారు. ఆలూరు నియోజకవర్గ ప్రజలు తనను ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని హామీఇచ్చారు. టిడిపి మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్, మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు, ఉచ్చీరప్ప, బడిగింజల రంగన్న, కప్పట్రాళ్ల మల్లికార్జున, రామారావు నాయుడు, చిట్టెం చిన్నయ్య, సర్పంచి భాస్కర్, ఎంపిటిసి తిమ్మప్ప, మలకన్న, మల్లయ్య, మల్లికార్జున గౌడ్, మల్లెపల్లె రంగడు, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పెద్దయ్య, రాజగోపాల్ గౌడ్, నాగేష్, తిమ్మప్ప, లక్ష్మన్న, కాశీమన్న వెంకటేష్, జనసేన మహిళా మండల అధ్యక్షులు సరోజ, బిజెపి నాయకులు రవికుమార్, వీరయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్ర గౌడ్

మాటకు కట్టుబడి ఉన్న నాయకుడు బాలనాగిరెడ్డి

- వైసిపి మండల కన్వీనర్ మురళీ మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్న నాయకుడు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అని వైసిపి మండల కన్వీనర్ పి.మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం కోసిగిలోని మైనారిటీ కాలనీ, గాంధీ నగర్, ఎన్‌టిఆర్ కాలనీ, మార్కెండేయ గుడి ఏరియా, కొండనగేని వీధుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అందరికీ అందుబాటులో ఉంటూ కోసిగిలో ప్రశాంత వాతావరణానికి కల్పించిన నేత బాలనాగిరెడ్డి అని తెలిపారు. ఒక ఓటు ఎమ్మెల్యే అభ్యర్థి బాల నాగిరెడ్డికి, రెండో ఓటు ఎంపీ అభ్యర్థి బివై.రామయ్యకు వేసి గెలిపించాలని కోరారు. ముందుగా మండల నాయకులతో కలిసి ముఖ్యమంత్రి జగన్ పాలన, గతంలో పాలించిన చంద్రబాబు పాలన వ్యత్యాసాలను ప్రజలకు వివరిస్తూ, మోసకారి చంద్రబాబు మాటలు నమ్మకండి అంటూ ఓటర్లకు సూచించారు.



ప్రచారం నిర్వహిస్తున్న మురళీ మోహన్ రెడ్డి

'పనుల దగ్గర తాగునీరుండాలి'

ప్రజాశక్తి - చిప్పగిరి

ఎండలు తీవ్రంగా ఉన్నందు వల్ల ఎక్కడైతే ఉపాధి హామీ పనులు చేస్తున్నారో అక్కడే తప్పనిసరిగా తాగునీరు ఉండేటట్లు చూసుకోవాలని ఎపిఒ మాధవ శంకర్ ఉపాధి హామీ కూలీలకు తెలిపారు. శనివారం కొందనగుర్తి, నగరడోన గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లి ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎపిఒ మాట్లాడారు. ఎండలు చాలా తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఉపాధి పనులు చేసుకునే వారందరూ ఉదయం ఎంత త్వరగా వెళితే అంత మంచిదని, ఎండలు వచ్చేలోపు పనులు ముగించుకొని ఇంటికి చేరుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ కూలి కూడా ఈ ఏప్రిల్ నెల 1 నుంచి రూ.300 చెల్లించేందుకు అంగీకారం తెలిపిందన్నారు. ఈ నెల నుంచే ఉపాధి హామీ కూలిలు లెక్కలోకి వస్తాయన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మన్న, ఆనంద్ పాల్గొన్నారు.

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చెట్నిహల్లి గ్రామంలో టిడిపి అభ్యర్థి ఎన్.రాఘవేంద్ర రెడ్డి తరఫున ఆయన సోదరుడు, మాధవరం మాజీ సర్పంచి రఘునాథ్ రెడ్డి ఇంటింటికీ తిరిగి ప్రచారం చేపట్టారు. శనివారం గ్రామానికి చేరుకున్న ఆయన తన గ్రూపుతో కలిసి ప్రతి ఇంటికీ తిరుగుతూ మీ కష్టసుఖాల్లో తోడుగా ఉంటామని, ఈ రాక్షస పాలనను అంతం చేసి రైతు ప్రభుత్వమైనా టిడిపిని అధికారంలోకి తీసుకొద్దామని కోరారు. టిడిపి సూపర్ సిక్స్ పథకాలను అందరికీ చెబుతూ అందరిలో తాను ఒక్కడై ఎంతో ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ప్రతి కుటుంబానికీ పెద్దగా ఎల్లప్పుడూ తోడుగా ఉంటానంటూ హామీ ఇచ్చారు. వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని కోరారు. చాపల నగేష్, మేకల మల్లేష్, పూజారి మల్లేష్, బోయ గోపాల్, నాగేంద్ర, కురువ మల్లేష్, చిన్న నాగన్న, భీముడు, కురువ వీరేష్, పూజారి హనుమంతు, హుసేని ఆలం, కౌలిట్లు, టెంపర్, నబి, ఇమ్రాన్, బిజెపి, జనసేన, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న రఘునాథ్ రెడ్డి



కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు


ఘనంగా బీవీ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి పుట్టినరోజు వేడుకలను టిడిపి మండల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం గోనెగండ్లలో జయనాగేశ్వర రెడ్డి చిత్రపటంతో కూడిన భారీ కేక్‌ను కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఎమ్మిగనూరుకు వెళ్లి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. టిడిపి నాయకులు నజీర్ సాహెబ్, గంజిల్ల కృష్ణమ నాయుడు, తిరుపతయ్య నాయుడు, రమేష్ నాయుడు, రంగస్వామి నాయుడు, అచ్చుగట్ల ఫక్రుద్దీన్, జిలాని, పూజారి చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, మదీనా, నూర్ అహ్మద్, ఎస్ఎన్.మహబూబ్ వలీ, లక్ష్మీకాంత పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి ఉమ్మి యూసుఫ్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



కండువా కప్పి ఆహ్వానిస్తున్న నీలకంఠప్ప

పట్టణ ఎంఐఎం పార్టీ అధ్యక్షులు ఉమ్మి యూసుఫ్ శనివారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నీలకంఠప్ప ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ఉమ్మి యూసుఫ్‌కు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉమ్మి యూసుఫ్ మాట్లాడారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమనే నమ్మకంతో కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని చెప్పారు. రాష్ట్రంలో పిసిసి అధ్యక్షులు షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం వస్తుందన్నారు. అనంతరం నీలకంఠప్ప మాట్లాడారు. కాంగ్రెస్ అభివృద్ధి కోసం నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు దిలీప్ ఢోకా, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మారుతి రావు, పట్టణ అధ్యక్షులు సాయినాథ్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు మాణిక్యరావు, కాంగ్రెస్ ముస్లిం, మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎమ్‌డి.నూర్ పాల్గొన్నారు.

In the Court of The Addl.Senior Civil Judge:Anantapur
I.P No:24/2021

Between:
Kamala Raghunath ...Petitioner
And
P.Veera Reddy and Others ...Respondants


Notice to Respondant
No:1,3,11,13,19,20,39,51,53,54,55,64,66 and 67

R1: P.Veera Reddy,R/of S.M.T Colony, Yemmiganur(M)
R3: Prabhakar Reddy S/o Venkata Rami Reddy R/of D/no: 2-110, Near Ayyapa Swamy Temple, Yemmiganur
R11: J.Ravi Prakash S/o J.Ramakrishna,R/of D/no: 1-2260, Miltary Colony, Yemmiganur
R13: Prabalada S/o Devendrappa, Krishna Shop,R/of S.M.T Colony, Yemmiganur(M)
R19: Chitli Finance Bussiness, R/of Somappa Nagar, Yemmiganur (M)
R20: M.K.Lakshmanna S/o M.K.Ramanna, cloth Bussiness, R/of Gandhi Nagar, Yemmiganur (M)
R39: Mallesh S/o Govinda, R/of Kandanathi Village, Yemmiganur(M), Kurnool Dist.
R51: Lingaiah S/o Rudranna, Plastic Bussiness, R/of D/no:1-3485, Raghavendra Colony, Yemmiganur(M).
R53: B. Bazari Reddy S/o B. Anjina Reddy, Real Estate Bussiness R/of D/no:2-70-B, Agraharam Village, Yemmiganur Mandal
R54: Balu S/o Lakshmana, Painter R/of Hanumapuramu Village, Yemmiganur(M)
R55: Manju S/o Veknkatesh Working as at H.P Petrol Bunk, Bypass Road, Yemmiganur Mandal
R56: Anjineyulu S/of Ranganna, Working as Teacher, Z.P.H School, Gonegandla Mandal.
R64: Golla Venkataramudu S/o Ramachandra Reddy, R/of Gudikal village, Yemmiganur Mandal.
R66: Mone Ramalinga S/o Thimmappa, Kirana Shop, R/of Gudikal village, Yemmiganur Mandal.
R67: Saraswathi W/o Venkataramana, R/of S.M.T Colony, Yemmiganur(M), Kurnool Dist.

పై నెంబరు కేసులో రెస్పాండెంట్లు అయిన మీ హాజరు నిమిత్తం 25-04-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

B.Nalla Reddy,
Advocate, Anantapuramu, Cell:7702983833



బిజెపి కూటమి, వైసిపిని ఓడించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

భారతదేశంలో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో మతతత్వ బిజెపిని, దానితో కూటమి జత కట్టిన టిడిపి, జనసేనను, నియంతృత్వ వైసిపిని ఓడించాలని ప్రజలు సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ కోరారు. శనివారం బండి ఆత్మకూరు మండల కేంద్రంలో సిపిఎం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పది సంవత్సరాలుగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం భారతదేశ సంపదను, ప్రకృతి సంపదను, సహజ వనరులను ప్రపంచ కార్పోరేట్ దిగ్గజాలైన అంబానీ, అదానీ సంస్థలకు, బహుళ జాతి కంపెనీలకు దోచిపెట్టిందని విమర్శించారు. ప్రజలను మరింత పేదవారీగా చేస్తూ పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు నిత్యాసర సరుకులు ధరలను, వంటనూనె ధరలను ఆకాశాన్నంటేలా చేస్తూ ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. సిపిఎం బలపరుస్తున్న ఇండియా వేదిక అభ్యర్థులను ఈ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. బిజెపి 10 సంవత్సరాలుగా పరిపాలన చేస్తూ అయోధ్యలో రామమందిరం నిర్మిస్తామని, మధురలో కృష్ణ మందిరం నిర్మిస్తామని చెబుతూ మతం మత్తులో ప్రజలను దించి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ సిటిజన్ అమెండ్మెంట్ యాక్ట్ తీసుకువచ్చి దేశంలోనే మైనార్టీలలో గందరగోళం సృష్టించిందని అన్నారు. వారు భారతదేశ పౌరుల కాదా అని ఇప్పుడు నిర్ధారించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. భారతదేశం లౌకిక, ప్రజాస్వామ్య దేశమని, సర్వ మతాలు, సర్వ కులాలతో కూడిన ఏకత్వంలో భిన్నత్వం కలిగిన దేశమని, అలాంటి దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కులాల మధ్య, మతాల మధ్య చిచ్చుపెట్టి లౌకిక భావాలను దెబ్బతీస్తూ భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ వ్యవస్థను బిజెపి భ్రష్టు పట్టిస్తోందన్నారు. భారత రాజ్యాంగ వ్యవస్థను ప్రపంచ దేశాలు కీర్తిస్తున్నా బిజెపి మాత్రం రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నం చేస్తోందని, ముస్లిం మైనార్టీలపైనా, క్రిస్టియన్ మైనార్టీలపైన హింసాత్మక దాడులకు పాల్పడుతూ వారి మధ్య చిచ్చు పెడుతోందన్నారు. సైన్యం, ఆయుధాలు ఇచ్చి మణిపూర్లో మహిళలపై అరాచక చర్యలను ప్రోత్సహించడం దారుణమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని, ఎపిలో జరిగే ఎన్నికల్లో దాన్ని పొత్తు పార్టీలను ఓడించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు రామచంద్రుడు, మండల కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డేవిడ్, నాయకులు రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్

బనగానపల్లె, అవుకు మండలాల్లో వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని పసుపల గ్రామానికి చెందిన 11 మంది వాలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను గ్రామపంచాయతీ కార్యదర్శి ఎస్వి సుబ్బమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన వాలంటీర్లు మాట్లాడుతూ మళ్లీ జగన్నను ముఖ్యమంత్రిగా, బనగానపల్లె ఎమ్మెల్యేగా కాటసాని రామిరెడ్డి ని గెలిపించుకోవడమే తమ ధ్యేయమన్నారు. అందుకోసమే తాము వాలంటీర్ల సేవలకు రాజీనామాలు చేస్తున్నామని తెలిపారు. **అవుకు :** అవుకు మండలం రామాపురం గ్రామంలోని 13 మంది వాలంటీర్లు రాజీనామా చేస్తూ పత్రాలను ఎంపీడీవో మల్రెడ్డికి అందజేశారు. వాలంటీర్ల రాజీనామాలను ఆమోదించినట్లు ఎంపిడిఒ తెలిపారు.



రాజీనామా చేసిన పత్రాలను గ్రామపంచాయతీ కార్యదర్శి అందజేస్తున్న పసుపుల వాలంటరీలు

అవస్థల 'పింఛన్'

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సామాజిక భద్రత పింఛను పొందుతున్న లబ్ధిదారులకు నేరుగా ఇళ్ల వద్దకే వెళ్లి పింఛను అందజేయాలని ప్రతిపక్షాలు కోరినప్పటికీ ప్రభుత్వం స్పందించ లేదు. సచివాలయాల వద్దనే లబ్ధిదారులకు పింఛను పంపిణీ ప్రక్రియకు ప్రభుత్వం ఆమోదముద్ర వేయడం పట్ల ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పింఛన్ల కోసం సచివాలయాల వద్ద లబ్ధిదారులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. లబ్ధిదారులకు నీడ వసతి కల్పించేందుకు ఎలాంటి టెంట్లు కానీ, తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేదు. పింఛన్ల పంపిణీ తీరుపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో బుధవారం నుంచి సామాజిక భద్రత పింఛన్ల పంపిణీని ప్రభుత్వం ప్రారంభించింది. సచివాలయాల్లోనే లబ్ధిదారులకు పింఛను మంజూరు చేయాలని కలెక్టర్కు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. సచివాలయాల నుంచే పింఛను పంపిణీకి చర్యలు చేపట్టారు. కేవలం అనారోగ్యంతో బాధపడేవారు, వికలాంగులకు మాత్రమే ఇంటి వద్దకు వెళ్లి పింఛను పంపిణీ చేసేందుకు ఆదేశాలు ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామ/వార్డు సచివాలయాల్లో పింఛన్ల పంపిణీని ఉదయం 6 గంటల నుంచి ప్రారంభించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఎక్కడా అమలుకు నోచుకోలేదు. ఉదయం 11 గంటల తర్వాతనే సచివాలయ సిబ్బంది అక్కడికి చేరుకొని లబ్ధిదారులకు పింఛను నగదును అందజేశారు. మండుటెండలో పింఛన్లు తీసుకుని ఇళ్లకు వెళ్లడంతో లబ్ధిదారులు కొంత అసహనానికి గురయ్యారు. సచివాలయాల వద్ద పింఛను లబ్ధిదారులు కూర్చునేందుకు అవసరమైన సీటింగ్, టెంట్లు కూడా ఏర్పాటు చేయలేదు. గంటల తరబడి లబ్ధిదారులు సచివాలయ ప్రాంగణం ఎదుటే కూర్చుని ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇంటి వద్దనే లబ్ధిదారులకు పింఛను నగదు అందజేసేలా చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి.

పది మూల్యంకనం ప్రారంభం : పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమైంది. అనేకమంది ఉపాధ్యాయులు పలు కారణాలతో విధులు నిర్వహించేందుకు ముందుకు రాకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులైన ఉపాధ్యాయులకు తప్పని సరిగా మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆర్జిఎం ఇంజనీరింగ్ కాలేజ్లో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వాల్యుయేషన్కు సంబంధించి దాదాపుగా రెండు లక్షల పేపర్లు వచ్చాయి. రావడం జరిగినదని,స్పాట్ వాల్యుయేషన్ కొరకు 120 మంది చీఫ్ ఎగ్జామి నర్లు, 720 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా, 200 మంది స్పెషల్ అసిస్టెంట్లుగా నియామించారు. 1040 ఎగ్జామినర్లకు అవసరమైన మంచినీటి వసతి, మెడికల్ సిబ్బందిని ఏర్పాటు చేశామని,పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియను ఈనెల 8 వరకు నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారి ఏర్పాటు చేశారు. రోజూ కేవలం 40 జవాబు పత్రాలను మాత్రమే అసిస్టెంట్ ఎగ్జామినర్ మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. అలాగే పదో తరగతి జవాబు పత్రాలను మూల్యాంకనం నిర్వహించిన ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ కూడా త్వరగా చెల్లించాలని ఉపాధ్యాయులు కోరుతున్నాయి.

కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు : త్వరలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తున్న అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇడుపులపాయలో ఎపిసిసి వైఎస్.షర్మిల అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. కర్నూలు ఎంపీ స్థానానికి, నంద్యాల, నందికొట్కూరు, కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థుల పేర్లు ఖరారు చేశారు. కర్నూలు ఎంపీ స్థానానికి బివి.రాంపుల్లయ్య యాదవ్, నంద్యాల అసెంబ్లీ స్థానానికి గోపవరం గోకుల్ కృష్ణారెడ్డి, నందికొట్కూరు అసెంబ్లీ స్థానానికి తోగురు అర్థర్, కోడుమూరు అసెంబ్లీ స్థానానికి పరిగెల మురళీ కృష్ణ పేర్లను ప్రకటించారు. గోకుల్ కృష్ణారెడ్డి నంద్యాల జడ్పిటిసి సభ్యునిగా ఉన్నారు. ఇటీవల వైసిపి నుంచి కాంగ్రెస్లో చేరారు. తోగురు ఆర్థర్ నందికొట్కూరు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇటీవల వైసిపి నుంచి కాంగ్రెస్లోకి చేరారు. పరిగెల మురళీ కృష్ణ మాజీ ఎమ్మెల్యేగా పని చేశారు. ఇటీవల వైసిపిని వీడి కాంగ్రెస్లోకి చేరారు.



శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు ప్రారంభం

- భృంగి వాహనంలో స్వామి అమ్మవార్లు
- మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో ఉగాది మహోత్సవాలు శనివారం సాంప్రదాయ బద్ధంగా ప్రారంభ మయ్యాయి. దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు దంపతులు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు వేదపండితులు కలిసి ఐదురోజుల పాటు ఉగాది ఉత్సవాలను ఆగమ శాస్త్రం ప్రకారం ముందుగా యాగశాల ప్రవేశం చేశారు. వేదస్వస్తి, శివ సంకల్పం, లోకకళ్యాణం కోసం సంకల్పం చెప్పారు. ప్రారంభించారు. గణపతి పూజ, పున్యాహవచనం, చండీశ్వర పూజ, కంకణ పూజ, కంకణ ధారణ, ఋత్విగ్వరణం, అఖండస్థాపన, రుద్రకలశ స్థాపన, సాయంకాలం అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించారు.

భృంగి వాహనంలో స్వామి అమ్మవార్లు

మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు

ఉగాది పర్వదిన సందర్భంగా శ్రీశైల క్షేత్రంలో జరుగుతున్న మహోత్సవాలలో మొదటి రోజు స్వామి అమ్మవార్లు భృంగి వాహనంలో, మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలలో భాగంగా అలంకార మండపంలో భృంగి వాహనంపై స్వామి అమ్మ వార్ల ఉత్సవమూర్తులను ఏర్పాటు చేసి పూజలు చేశారు. అలాగే అమ్మవారిని మహాలక్ష్మి అలంకారంలో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం విద్యుత్ దీపాలు, వేదమంత్రాల మధ్య వివిధ కళారూపాలు, నృత్య ప్రదర్శనల మధ్య ఆలయ ప్రధాన వీధుల్లోకి ఆలయ రాజగోపురం గుండా ప్రవేశించారు. ఆ తర్వాత గంగాధర మండపం వద్ద మరోసారి పూజలు నిర్వహించి అనంతరం అక్కడి నుండి నంది గుడి, అక్కడి నుండి బయలు వీరభద్ర స్వామి వరకు, అనంతరం ఆలయంలోకి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో వేలాది మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకోవడం జరిగింది. ఈ గ్రామోత్సవంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉగాది ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు : శ్రీశైలం క్షేత్రంలో జరుగుతున్న ఉగాది మహోత్సవాలలో స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో శ్రీశైలం చేరుకున్నారు. శ్రీశైలం చేరుకున్న భక్తులను అలరించేందుకు దేవస్థానం పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు కన్నడ, తెలుగు భాషల్లో ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆలయ దక్షిణమాడ వీధిలో, పుష్కరిణి వద్ద, శివ దీక్ష శిబిరాలలో సాయంత్రం ఐదు గంటల నుండి రాత్రి పది గంటల వరకు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులను అలరించేందుకు ఏర్పాటు చేశారు.



యాగశాల ప్రవేశం పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఇఒ దంపతులు, ఉభయ దేవాలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు



భృంగి వాహనంలో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు, మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు



భక్తిరంజని కార్యక్రమంలో భక్తి గీతాలను ఆలపిస్తున్న యువతులు



ఇంటింటి ప్రచారంలో వైసిపి అభ్యర్థి దార సుధీర్

అవకాశమివ్వండి అభివృద్ధి చేస్తా : దారా సుధీర్

ప్రజాశక్తి - కొత్తపల్లి : ఒక్క అవకాశం ఇస్తే నందికొట్కూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని నందికొట్కూర్ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ తెలిపారు. శనివారం కొత్తపల్లి మండలం జానాల గూడెం, సిద్దేశ్వరం, బలపాల తిప్ప, ఎర్రమఠం గ్రామాల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసేందుకు తాను రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. ఎన్నికల్లో తనను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జడ్పిటిసి సోమల సుధాకర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి, నాగంపల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్ధన్ రెడ్డి, సర్పంచులు బాల ఎల్లయ్య, విజయ్ కుమార్, మారెన్న, మాజీ సొసైటీ చైర్మన్ రామ సుబ్బారెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు మహబూబ్ బాషా, నాగంపల్లి సొసైటీ అచ్చిరెడ్డి, మండల కో ఆప్టడ్ మెంబర్ మహ్మద్ గౌస్, సచివాలయాల మండల కన్వీనర్ నాగలక్ష్మీ రెడ్డి, మండల నాయకులు నారాయణ రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, మల్లికార్జున రెడ్డి, మధుసూదన్ రెడ్డి, భరత్, చింతమాను శ్రీనువాసులు యాదవ్, నాగ ఎల్లయ్య, శ్రీనువాసులు రెడ్డి, రహంతుల్లా, బాబు రెడ్డి, పాండు, కృష్ణుడు, సాయన్న, పెద్ద స్వామి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-డోన్ : డోన్ పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణంలో భారత్ గ్యాస్ అధినేత రాజా విజయ్ కుమార్ సహకారంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శనివారం డోన్ ఆర్టీసీ డిపో ఆవరణంలో భారత్ గ్యాస్ అధినేత రాజా విజయ్ కుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శశిభూషణ్లు కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికులు ఈ చలివేంద్రాన్ని వినియోగించు కోవాలని కోరారు.



మంచి నీటిని అందిస్తున్న భారత్ గ్యాస్ అధినేత రాజా విజయ్ కుమార్, డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శశిభూషణ్

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

- టిడిపి అభ్యర్థులను గెలిపించండి
- నారా భువనేశ్వరి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్రంలో జగన్ అరాచక పాలనకు చరమగీతం పాడాలని, టిడిపి అభ్యర్థులను గెలిపించాలని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ప్రజలను కోరారు. నిజం గెలవాలి కార్యక్రమం లో భాగంగా రెండో రోజు శనివారం నంద్యాలలోని చెరువు కట్ట వద్ద వున్న ఎస్ఎన్ ఫంక్షన్ హాల్లో నంద్యాల నియోజకవర్గ ముస్లిం మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడారు. నాడు నందమూరి తారక రామారావు పేదవాడికి పట్టెడన్నం పెట్టాలని, పేదలను ఆదుకోవాలని తెలుగుదేశం పార్టీని స్థాపించారని అన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని తెలిపారు. ఆయన అడుగు జాడల్లో నారా చంద్రబాబు నాయుడు ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు తెచ్చారని చెప్పారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలకు అన్యాయం జరిగిందని వ్యాఖ్యనించారు. చివరకు మహిళలపైనా దాడులు చేస్తున్నారని విమర్శించారు. నంద్యాల అంటే గుర్తుకు వచ్చేది సలాం కుటుంబమని, వైసిపి నాయకులు, పోలీసుల వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. టిడిపి కార్యకర్తలనే కాకుండా, సాధారణ ప్రజలను కూడా హింసిస్తున్నారని ఆరోపించారు. జగన్ మోహన్ రెడ్డి చెప్పేదానికి చేసేదానికి పొంతన ఉండటం లేదన్నారు. చంద్రబాబు నాయుడు మళ్లీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. నంద్యాలలో ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరిని, ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్లను గెలిపించాలని ఆమె మహిళలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి.ఫరూక్, జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్, మాజీ మంత్రి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి భూమా అఖిలప్రియ, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **మిడుతూరు :** సైకిల్కు ఎవరు ఎదురొచ్చినా తొక్కి పారేయాలని టిడిపి శ్రేణులకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా నారా భువనేశ్వరి మిడుతూరు మండలం నాగులూటి గ్రామంలో పర్యటించారు. చంద్రబాబు నాయుడు జైలుకు వెళ్ళినప్పుడు మనస్థాపానికి గురై గుండెపోటుతో చిన్న మాసుంసాహెబ్ మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా టిడిపి ఆధ్వర్యంలో ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. నందికొట్కూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య, నంద్యాల ఎంపీ అభ్యర్థి శబరి, పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి, గౌరు వెంకట్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రమణారెడ్డి, వంగాల శివరామిరెడ్డి, నాగలూటి రవి, వెంకటరెడ్డి, బాబు సాహెబ్, చెరుకుచర్ల రఘురామయ్య, హరి సర్వోత్తమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారా భువనేశ్వరి



కుటుంబసభ్యులకు భరోసాపత్రం అందజేస్తున్న నారా భువనేశ్వరి

విద్యుత్ షాక్తో ఎలుగుబంటి మృతి

ప్రజాశక్తి - మహానంది

విద్యుత్ షాక్తో ఎలుగుబంటి మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. మహానంది సమీపంలోని ఎంసి ఫారం, తెలుగు గంగ ప్రధాన కాలువ వద్ద అరటి తోట రక్షణ కోసం పెట్టిన విద్యుత్ వైరు తగిలి ఎలుగుబంటి మృతి చెందినట్లు డిఆర్ఓ హైమావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నంద్యాల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దినేష్ కుమార్ రెడ్డి, మహానంది, తిమ్మాపురం వీఆర్వోలు శివ ప్రసాద్, సురేంద్రనాథ్ సమక్షంలో పశు వైద్యాధికారి డాక్టర్ కరుణాకర్ పోస్టుమార్టం చేయించి దహనం చేసినట్లు పేర్కొన్నారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టామన్నారు.



పోస్టుమార్టం చేసిన వైద్యాధికారి

వైసిపి కో ఆప్షన్ సభ్యుడు అరెస్టు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని సాయిబాబా పేటలో ముస్లిం మహిళను బురకతీసి అవమానపరిచిన వైసిపి కో ఆప్షన్ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డిపై ఫిర్యాది మేరకు శనివారం అరెస్టు చేసి రిమాండ్కు పంపినట్లు సిఐ ప్రకాష్ కుమార్ తెలిపారు. నందికొట్కూరు పట్టణంలోని మిడుతూరు రోడ్డు డిగ్రీ కళాశాల వద్ద శ్రీనివాసరెడ్డిని అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు.

వ్యక్తి అదశ్యం - కేసు నమోదు

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలం చెలిమిల్ల గ్రామానికి చెందిన శెట్టి ప్రతాప్ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ యేసయ్య శనివారం తెలిపారు. ఏఎస్ఐ మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీ నుండి ప్రతాప్ కనిపించడం లేదని అతని భార్య స్వరూప ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రతాప్కు కొద్దిగా మతిస్థిమితం సరిగా లేదని, ప్రతిరోజు ఉదయం ఇంటి నుంచి పాములపాడుకు వచ్చి రాత్రి 10 గంటల లోపు వచ్చేవాడని, ఒకటో తారీకు ఉదయం వెళ్లి ఇప్పటి వరకు ఇంటికి రాలేదని తెలిపిందన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ప్రతాప్ (ఫైల్)

అభివృద్ధి చేసిన వారిని ఆదరించాలి : చైర్మన్

ప్రజాశక్తి-డోన్

డోన్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన వారిని ఎన్నికల్లో డోన్ ప్రజలు ఆదరించాలని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ కోరారు. మంగళవారం డోన్ పట్టణంలోని 5, 6 వార్డులలో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పట్టణంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని ఫ్యాను గుర్తుకు ఓటేసి మళ్లీ గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని కాలనీవాసులను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ టియి.దినేష్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు వైయస్సార్ రఫీ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పోస్ట్ ప్రసాద్, పట్టణ యూత్ అధ్యక్షుడు అర్ఈ రాజవర్ధన్ గౌడ్, కౌన్సిలర్లు కురుకుంద పద్మావతి, కటిక వేణు, నాగేంద్ర, మహేశ్వరరెడ్డి, ఆర్ట్ రమణ, వెంకట్రాముడు, సుంకన్న, పట్టణ అధ్యక్షుడు కురుకుంద హరి, కార్యకర్తలు పాల్గొన్నారు.



ముస్లిం సోదరుల ఓటును అభ్యర్థిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

వైసిపిలో మైనార్టీలకు దక్కని సముచిత స్థానం

- ఎమ్మెల్సీ ఇక్బాల్ - పదవికి, పార్టీకి రాజీనామా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వైసిపి పాలనలో మైనార్టీలకు సమచిత స్థానం దక్కడం లేదని ఆ పార్టీ ఎమ్మెల్సీ, రిటైర్డ్ ఐపిఎస్ అధికారి ఇక్బాల్ అన్నారు. శనివారం నంద్యాలలోని టిడిపి కార్యాలయంలో మాజీ మంత్రి, నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్ని ఎమ్మెల్సీ ఇక్బాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి మైనార్టీల ద్రోహి అని, వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. బైజూస్ భారీ స్కామ్ అని, లిక్కర్ మరో భారీ స్కాం అని, ఇలా ఎన్నో చేసుకుంటూ పోతున్నారన్నారని ఆరోపించారు. సిఎఎపై వైసిపి దుష్ప్రచారం చేస్తుందని, దానికి మద్దతు ఇచ్చిందన్నారు. వైసిపిలో గౌరవం లేకపోవడంతో బయటికి వచ్చేసానని తెలిపారు. అలాగే ఫార్మెట్లో ఎమ్మెల్సీ పదవికి, వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశానని చెప్పారు. ప్రజలు సంక్షేమంగా ఉండాలంటే వ్యవస్థలలో మార్పు రావాలన్నారు. వైసిపి ప్రభుత్వంలో ధరలన్నీ పెంచేసి ప్రజలపై పెను భారం మోపుతుందన్నారు. మైనారిటీ హక్కుల పరిరక్షణకు, ప్రజల సంక్షేమం కోసం సరైన నాయకుడు కావాలన్నారు. మైనార్టీలు అభివద్ధి చెందాలన్నా, మైనార్టీ ఆస్తులు కాపాడుకోవాలన్నా, వక్ఫ్ బోర్డు ఆస్తులు కాపాడుకోవాలన్నా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. రెండు రోజుల్లో ఓ మంచి శుభవార్త వింటారాన్నారు. అనంతరం ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఇక్బాల్ తనను కలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. శాసనమండలిలో ప్రజల సమస్యలపై పోరాడే వ్యక్తులలో, మైనార్టీ హక్కుల గురించి పోరాటం చేసే వ్యక్తులలో ఇక్బాల్ ఒకరన్నారు. త్వరలోనే వారు ఆయన మంచి నిర్ణయం తెలియజేయబోతున్నారని అన్నారు.



ఎన్ఎండి ఫరూక్ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్సీ ఇక్బాల్


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న గంగుల అవంతికారెడ్డి

గంగులను గెలిపించండి : అవంతికా రెడ్డి

ప్రజాశక్తి - చాగలమర్రి

ఆళ్లగడ్డ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డిని మరోసారి గెలిపించాలని ఆయన సోదరి గంగుల అవంతికారెడ్డి ప్రజలను కోరారు. శనివారం మండలంలోని శెట్టివీడు, కదిరిపురం, కేపీ తండాలలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తన సోదరున్ని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి వీరభద్రుడు, జడ్పీటీసీ లక్ష్మిదేవి, సర్పంచ్ శ్రీలక్ష్మిబాయి, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, ఎంపీటీసీ పత్తినారాయణ, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి రమణ,జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, శేషు రమేష్, చాంద్ బాషా, రమణారెడ్డి, సింగల్ విండో డైరెక్టర్ శ్రీనివాసులు, మనోహర్‌రెడ్డి, చిన్నారెడ్డి, మహబూబ్ బాష, చిన్న ఓబులేసు, అశోక్, యోహాన్, రాజేష్, జార్జ్, శంకర్ నాయక్, శివ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీ నాయకుడు మృతి

- నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని కొండపేటకు చెందిన ముస్లిం మైనార్టీ నాయకుడు గౌస్ మోదీన్ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి గౌస్ మోదీన్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

వెంకటేశ్వర స్వామికి విశేష పూజలు

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం సమీపంలో వెలిసిన వాసాపురం వెంకటేశ్వర స్వామికి శనివారం ఘనంగా విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి గోపి శర్మ ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామికి కుంకుమార్చన, ధూప దీప నైవేద్యాలతో ఘనంగా పూజలు చేశారు. జిల్లాలోని పలు మండలాల నుంచి భక్తులు వందలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు దాతలు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సింగతల మధుసూదన రెడ్డి, ఉపాధ్యక్షులు లింగం వెంకట రంగనాయకులు శెట్టి, కోశాధికారి కానాల ఈడిగ నరసింహులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ పేకాటపై భారత రాష్ట్రపతికి ఫిర్యాదు

- జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ ఏఈ నాగరాజు గౌడ్

ప్రజాశక్తి-డోన్

ఆన్‌లైన్ పేకాట రద్దు చేయాలని భారత రాష్ట్రపతికి ఫిర్యాదు చేసినట్లు నంద్యాల జిల్లా ప్రభుత్వ విజిలెన్స్ కమిటీ మెంబర్ ఏఈ నాగరాజు గౌడ్ తెలిపారు. శనివారం డోన్ హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకి ఆన్‌లైన్‌లో పేకాట, రమ్మీపై ఎంతోమంది నష్టపోతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వెంటనే తొలగించాలని రిజిస్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ పేకాట, రమ్మీని నిరోధించకపోతే దేశవ్యాప్తంగా కూడా ధర్నా కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వంపై వ్యతిరేకతను తీసుకొస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డోన్ తాలూకా వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షులు మల్లికార్జున స్వామి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఈ నాగరాజు గౌడ్

శ్రీశైలంలో ట్రాఫిక్ జామ్

- 7 కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు
- టోల్ గేట్‌ల వద్ద అదే పరిస్థితి
- ఇబ్బందులు పడిన మల్లన్న భక్తులు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలో శనివారం ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. శిఖరేశ్వరం నుండి శ్రీశైలం వరకు దాదాపు 7 కిలోమేటర్ల మేర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వాహనదారులు, యాత్రికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉగాది ఉత్సవాలలో మల్లన్నను దర్శించుకునేందుకు ప్రత్యేక వాహనాలలో శ్రీశైలానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. దీంతో శనివారం ఉదయం 9 గంటల నుంచి 12 వరకు శిఖరేశ్వరం నుండి శ్రీశైలం వరకు ట్రాఫిక్ జామ్ అయింది. అటవీశాఖ ఏర్పాటు చేసిన బైర్లూటీ, కొర్రప్రోలు, దోర్నాల గణపతి, శిఖరేశ్వరం, సాక్షి గణపతి, శ్రీశైలం టోల్ గేట్‌ల వద్ద కూడా అదే పరిస్థితి నెలకొంది. టోల్ గేట్‌ల వద్ద ఒక్కరే కంప్యూటర్ టికెట్ కొట్టడంతో ఆలస్యమై సుమారు ఒక కిలోమీటర్ మేర వాహనాలు నిలబడుతున్నాయి. వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని టోల్ గేట్ టికెట్‌లు ఇచ్చేందుకు అదనంగా సిబ్బంది ఏర్పాటు చేయాలని వాహన దారులు, యాత్రికులు పేర్కొంటున్నారు. గతంలో ఎన్నడూ కూడా ఈ విధంగా ట్రాఫిక్ జామ్ కాలేదని, కర్ణాటక యాత్రికులకు చెప్పే వారు ఎవరూ లేకపోవడంతో ఎక్కడంటే అక్కడ రోడ్ల పక్కన పూర్తిగా రోడ్లు దిగకుండా వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య అధికమైంది. అలాగే క్షేత్ర పరిధిలో కూడా అదే పరిస్థితి నెలకొంది. వీరికి చెప్పడానికి స్థానికులు కూడా భయపడుతున్నారు. ఎందుకంటే శుక్రవారం నంది సర్కిల్ వద్ద దేవస్థానం సెక్యూరిటీ సిబ్బందిపై కర్నాటక యాత్రికులు దాడి చేశారు. గతంలో కూడా శ్రీశైలం క్షేత్రాన్ని అల్లకల్లోలం చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. దీంతో కర్నాటక యాత్రికులతో ఎందుకని స్థానికులు సంయమనం పాటిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ జామ్ కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


నిలిచిపోయిన వాహనాలు

టిడిపితోనే దళితుల సంక్షేమం : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూర్

రాష్ట్రంలో దళిత సామాజిక వర్గాలకు అనేక సంక్షేమ పథకాలను అమలుపరిచిన చరిత్ర తెలుగుదేశం పార్టీదేనని శ్రీశైలం మాజీ శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం ఆత్మకూరు పట్టణంలోని ఎంఎం ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా, దళితులకు ల్యాండ్ పర్చేజెస్ స్కీమ్ ద్వారా భూములు పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రత్యేకంగా వాహనాలు అందించామన్నారు. వైసిపి ప్రభుత్వం ఎస్సీలకు ఉన్న సంక్షేమ పథకాలను తొలగించిందని తెలిపారు. ఆత్మకూర్ పట్టణంలో స్థానిక శాసనసభ్యులు వర్ధన్ బ్యాంకు పేరుతో 30 కోట్ల రూపాయలు దళిత, మైనార్టీ, బీసి సామాజిక వర్గాల నుండి వసూలు చేసి ఆ బ్యాంకును మూసివేసిన చరిత్ర ఉందన్నారు. జగన్ ప్రభుత్వం మళ్లీ నేడు ప్రజల ముందుకు వస్తుందని, దళిత సామాజిక వర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండి టిడిపికి చేయూత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాబిన్సన్ రాజు. దర్గయ్య. నాగశేషులు. జనసేన నాయకులు శ్రీరాములు. టిడిపి నాయకులు కలిముల్లా. జట్టి వేణుగోపాల్ అబ్దుల్లాపురం బాషా తదితరులు పాల్గొన్నారు.


అభినందనలు వ్యక్తపరుస్తున్న బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

వంద కుటుంబాలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - బనగానపల్లె

సంజామల మండలం గిద్దలూరు గ్రామానికి చెందిన 100 కుటుంబాలు వైసిపిని వీడి శనివారం బనగాపల్లె పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. గ్రామ టిడిపి నాయకులు బత్తుల ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో గిద్దలూరు వైసిపి నాయకులు కాటసాని పరమేశ్వర రెడ్డి, కాటసాని రామకృష్ణారెడ్డి, తెలుగు శ్రీనివాసులు, గుల్లదుర్తి సుబ్బయ్య, బెల్లం శిఖామణి, ముల్లా మహబూబ్మియా, ముల్లా మౌలాలి, ఈడిగ విశ్వనాథ్ గౌడ్, మాదిగ సుబ్బరాయుడు, మంగళ రవీంద్ర, తెలుగు ఓబులేసు, బెల్లం లాజర్, బత్తుల శివశంకర్ రెడ్డి, ముళ్ళ మహబూబ్మియా, ముల్లా మహబూబ్, ముల్లా అల్లా బాకాష్, బొడ్డు రామచంద్రారెడ్డి, తదితర 100 కుటుంబాలు టిడిపిలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే టిడిపి కండువా కప్పి పార్టీలోని ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రం ఎంతో వెనకబడిపోయిందన్నారు. అందరం కలిసి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేసుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకోవాలని కోరారు. టిడిపిలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరుతున్న వైసిపి నాయకులు

అభివద్ధి చేశా.. ఆదరించండి : ఎమ్మెల్యే గంగుల

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేశామని రానున్న ఎన్నికల్లో తిరిగి తనను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. శనివారం సిరివెళ్ల మండలం గంగవరం గ్రామంలో ప్రచారంలో పాల్గొని వైసిపిని అధికారంలోకి తేవాలని, సంక్షేమ పాలన మరల తిరిగి రావాలంటే జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు గోపవరం నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గంగుల

వైసిపితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం : వైకాపా తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని గంగుల సారికమ్మ అన్నారు. తన భర్త గంగుల బ్రిజేంద్ర రెడ్డి (నాని) గెలుపే లక్ష్యంగా సిరివెల్ల మండలం గుంపురమాన్‌దిన్నే గ్రామంలో ఆమె విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరింత అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాలంటే రానున్న ఎన్నికల్లో గంగుల.బ్రిజేంద్ర రెడ్డి (నాని)ని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైసీపీ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా కృషి చేయాలి : గుంగల ప్రభాకర్ రెడ్డి

రుద్రవరం : వైసిపి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ఉండి ఆళ్లగడ్డ అభ్యర్థి గంగుల బ్రిజేంద్రారెడ్డిని ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించుకోవాలని మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర నీటిపారుదల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకుడు పుటాలమ్మ క్షేత్రం చైర్మన్ గంగుల మనోహర్ రెడ్డి, మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డిలు కోరారు. శనివారం మండలంలోని కోటకొండ, ఎల్లావత్తుల, బీరవోలు, శ్రీరంగాపురం తదితర గ్రామాలలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం హయాంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. గ్రామాలలో కార్యకర్తల మధ్య మనస్పర్ధలు విడనాడి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డి, ఎంపీ అభ్యర్థి పోచ బ్రహ్మానంద రెడ్డిలను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రుద్రవరం : మాట్లాడుతున్న నాయకులు


చెక్ పోస్ట్ పరిశీలిస్తున్న స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ కమిషనర్

అక్రమ మద్యం రవాణాపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

సాధారణ ఎన్నికల దృష్ట్యా జిల్లాలో అక్రమ మద్యం రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ కమిషనర్ నాగ మద్దయ్య తెలిపారు. శనివారం ఆయన నందికొట్కూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలోని కేసుల వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల దష్ట్యా అక్రమంగా మద్యం నిల్వ చేసే అవకాశం ఉన్న ప్రదేశాలను తనిఖీ చేయాలన్నారు. పాత నేరస్థుల పై నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కోళ్లబావాపురం నందు గల అంతర్ రాష్ట్ర చెక్ పోస్టును సందర్శించారు. చెక్ పోస్టు నందు ప్రతి వాహనం క్షుణ్ణంగా తనిఖీ , ఇతర రాష్ట్రాల నుండి మద్యం రవాణాను నిరోధించాలని తెలిపారు. కార్యక్రమంలో నందికొట్కూరు సెబ్ ఇన్స్పెక్టర్ సీతా రామిరెడ్డి, ఎస్ఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.5.2 లక్షలు నగదు స్వాధీనం

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలం గాజులపల్లి గ్రామ పరిధిలోని ఆంజనేయపురం చెక్ పోస్ట్ వద్ద సరైన పత్రాలు లేకుండా తీసుకువెళ్తున్న రూ.5.2 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లైయింగ్ స్క్వాడ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారులో రూ.2.14 లక్షలు, మరో వాహనంలో రూ.2.88 లక్షలు స్వాధీనం చేసుకొని ట్రెజరీలో అప్పగించినట్లు పేర్కొన్నారు.

పాలీసెట్‌కు గడువు 10 వరకు పెంపు

ప్రజాశక్తి - బేతంచర్ల

పాలీసెట్ దరఖాస్తులకు ఈ నెల 10వ తేదీ వరకు గడువు పెంచినట్లు బేతంచెర్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఓఎస్‌డి రాజేష్ శనివారం తెలిపారు. అపరాధ రుసుం లేకుండా పదవ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చుని, ఈ నెల 27వ తేదీ పరీక్ష ఉంటుందన్నారు. పాలీసెట్ ఎంట్రన్స్ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని బేతంచెర్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత పాలీసెట్ శిక్షణ ఇవ్వబడుతుందని,విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- ఇద్దరు మహిళలకు గాయాలు

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని పలుకురు గ్రామ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దస్తగిరి(55) మృతి చెందాడు. మరో ఇద్దరు మహిళలకు గాయాలైనట్లు నందివర్గం ఎస్ఐ తిరుపాల్ తెలిపారు. వివరాలు.. మండలంలోని పలుకూరు గ్రామం నుండి దస్తగిరి ఆటోలో వస్తుండగా ఎదురుగా నందివర్గం నుండి మరో ఆటో అతివేగంగా వచ్చి ఆటోను ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న దస్తగిరితో పాటు లక్ష్మీదేవి, భారతీలకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని నంద్యాల వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక దస్తగిరి మృతి చెందాడు. మృతుని భార్య దూదేకుల దస్తగిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


మృతి చెందిన దస్తగిరి

'మా కుటుంబ సమస్యను కుల రాజకీయం చేయొద్దు'

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలో గురువారం రాత్రి 11 గంటలకు ప్రాంతంలో ముస్లిం మహిళపై జరిగిన సంఘటనపై కుల రాజకీయాలు చేసి మా కుటుంబాన్ని బజారుకు ఈడ్చవద్దని బాధిత కుటుంబ సభ్యులు విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక విలేకరులతో అబ్దుల్ వాహబ్, షేక్ సాదిక్ హుసేన్‌లు మాట్లాడుతూ ఈ సంఘటనతో ఏ రాజకీయ పార్టీలకు సంబంధం లేదనిన్నారు. గురువారం రాత్రి అనుకోకుండా జరిగిన సంఘటనపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. రాజకీయ నాయకులు వారి స్వార్థం కోసం జోక్యం చేసుకోవద్దని కోరారు.

టిడిపిలోకి వైసిపి నాయకులు

ప్రజాశక్తి - కొత్తపల్లి : కొత్తపల్లి మండలం ఎదురుపాడు, జడ్డువారిపల్లె వైసిపి నాయకులు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో శనివారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా బైరెడ్డి మాట్లాడుతూ రాబోయేది టీడీపీ ప్రభుత్వమని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. నంద్యాల ఎంపీ అభ్యర్థిగా తన కూతురు బైరెడ్డి శబరి పోటీ చేస్తుందని, కొత్తపల్లి మండల నాయకులు ఐక్యంగా సైకిల్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీ తీసుకురావాలని కోరారు. అనంతరం టిడిపిలో చేరిన కె.శ్రీనివాసులు, మహేష్, బాలస్వామి, రంగస్వామి యాదవ్, సామన్న, నారాయణ తదితరులకు బైరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

పారిశుధ్యం, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలి : కమిషనర్

ప్రజాశక్తి - డోన్ : డోన్ పట్టణంలో పారిశుధ్యం, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ యస్.జయరాం సిబ్బందికి సూచించారు. శనివారం డోన్ పట్టణంలోని టీచర్స్ కాలనీ, శ్రీరామ్ నగర్ సచివాలయాలకు సంబందించిన 21వ వార్డు నందు స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాం నిర్వహించారు. సుందర్ సింగ్ కాలనీ, గుంటూరు సుబ్బారావు సందు, టీచర్స్ కాలనీలో కమిషనర్ పర్యటించారు. స్థానిక ప్రజలతో తాగునీటి సమస్యపై ఆరాతీశారు. అలాగే రోజు వారీగా శానిటేషన్ జరుగుతుందా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా నీటి సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ ఏఈ సురేష్, శానిటరీ ఇన్స్పెక్టర్ మహబూబ్ బాషా, 11, 12వ సచివాలయం సిబ్బంది, వార్డ్ అడ్మిన్, వార్డ్ ప్లానింగ్ సెక్రటరీ, వార్డ్ అమ్యునిటీ సెక్రటరీ, వార్డ్ శానిటేషన్ సెక్రటరీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఐక్య పోరాటాలతోనే హక్కులు : సిఐటియు

ప్రజాశక్తి - ఆత్మకూర్

కార్మికులు, ఉద్యోగులు, రైతులు ఐక్య పోరాటాలు చేపట్టినప్పుడే తమ హక్కులను సాధించుకోవచ్చని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, అధ్యక్షులు ఏసురత్నంలు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సుదర్శన వర్మ భవనంలో ఆత్మకూరు, నందికొట్కూరు డివిజన్‌ల ప్రాంతీయ రాజకీయ శిక్షణ తరగతులు జిల్లా నాయకులు భాస్కర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో పెట్టుబడి దారి విధానం పెరిగిందని, కార్మికులపై అదనంగా పని భారం మోపి లాభాలను అర్జిస్తూ మరింత కోటీశ్వరులుగా మారుతున్నారని తెలిపారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ సివిల్ కోడ్‌లుగా కుదింపు చేసి కార్మికులను పెట్టుబడుదారులకు, కార్పొరేట్ సంస్థలకు నయా బానిసలుగా చేసే విధానాలను కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తుందని అన్నారు. రాబోయే కాలంలో పోరాటాల ద్వారా కార్మిక రాజ్యం స్థాపన సాధ్యవవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రజాక్, రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, నాయకులు నరసింహ, భాస్కర్, సురేంద్ర, వెంకట శివుడు, గోపాలకృష్ణ, స్వాములు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు వి.యేసురత్నం

వాలంటీర్ వ్యవస్థపై ప్రతిపక్షం విషం చిమ్ముతోంది : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రజలకు సేవలు అందించే వాలంటీర్ వ్యవస్థపై ప్రతిపక్షాలు విషం కక్కుతున్నాయని, ఇది చాలా బాధాకరమని నంద్యాల వైసిపి అభ్యర్థి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడి అన్నారు. శనివారం నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు పొన్నాపురంలో కౌన్సిలర్ పరుచూరి నారాయణమ్మ, వార్డు ఇన్చార్జ్ పరుచూరి శ్రీరాములు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో తనను మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, ఏపి ఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పామ్ షావలి, రెండవ పట్టణ అధ్యక్షుడు పున్నా శేషయ్య, జేసిఎస్ కన్వీనర్ దాల్మిల్ అమీర్, వార్డు నాయకులు నాగేశ్వరరెడ్డి, మధు గౌడ్, బండపల్లి మద్దిలేటి, ఎరుకలి కృష్ణ, రేవూరి లక్ష్మీదేవి, కాజా శ్రీనివాసులు, నాసరి సుంకన్న, బోడెన్న, రాజు, సుబ్బ, గోవిందరాజులు, తిరుపాలు, సంజన, కార్యకర్తలు పాల్గొన్నారు.

కన్నడ యాత్రికులకు వైద్య సేవలు

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఉగాది సందర్భంగా శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న కన్నడ భక్తులకు పెద్ద నాగలూటి, వీర భద్రాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నట్లు బైర్లూటి వైద్యాధికారి డా.పవన్ కుమార్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా భక్తులకు మందులు ఇస్తూ, ఆరోగ్య సూచనలు వివరిస్తూ, మూడు షిఫ్ట్‌లలో 24 గంటలు భక్తులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. అత్యవసర చికిత్స అవసరమైన వారిని 108 వాహనంలో బైర్లూటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆత్మకూరుకు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ ప్రవీణ్ కుమార్, ఆరోగ్య కార్యకర్తలు విశ్వనాథ్, భాస్కర్, 108 సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ పవన్ కుమార్

బుగ్గనను మరోసారి గెలిపించండి : చైర్మన్

ప్రజాశక్తి - బేతంచర్ల

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను వర్తింపజేసిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని ముచ్చటగా మూడోసారి గెలిపించాలని బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు ప్రజలను కోరారు. శనివారం మండలంలోని బుగ్గానిపల్లి గ్రామంలో కౌన్సిలర్లు కొమ్ము మధు, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలకు కృష్ణా జలాలను గోరకల్లు రిజర్వాయర్ నుండి అందించిన ఘనత మంత్రి బుగ్గనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ యశ్వంత్ రెడ్డి, వైసిపి నాయకులు అంబాపురం మద్దయ్య, ముద్దవరం రామచంద్రుడు, పిట్టల మధు కుమార్, బట్టు రవి, బట్టు కోదండ రాముడు, కల్లూరి శ్రీనివాసులు, ధనియాల రంగస్వామి, బోయ ఎమ్మెస్ నాయుడు, బట్టు రామచంద్రుడు, గుమ్మ బాలస్వామి, గుమ్మా వెంకటేశ్వర్లు, పిల్లి విజయుడు, కొమురెల్లి సుబ్బన్న, మునగాల రాజు, తలారి సుబ్బరాయుడు, భాష, పిట్టల మధు కుమార్, మాల సాల్మన్, మాల దాసు, బోయ సంజీవుడు, మాల మార్కు, కల్లూరి వెంకటేశ్వర్లు, గొల్ల క్రాంతి కుమార్, వైఎస్ఆర్సిపి నాయకులు రాఘవేంద్ర రెడ్డి, బోయపేట హరి, మల్లికార్జున, పాపసాని తిరుమలేశ్వర్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, మనీ వర్ధన్ రెడ్డి, పవన్ కుమార్, గోపాల్ రెడ్డి, నవీన్ సాయి, నడ్డి శ్రీనివాసులు, బొద్దుల రమేష్, ఉయ్యాలవాడ భాస్కర్, దేవుడు మద్దయ్య, రంగనాయకులు, గజ్జి మురళి, గజ్జి మద్దయ్య, శ్రీరామ సప్లయర్ మనోహర్, సాయికిరణ్, స్రామాట్, వెంకటేష్ నాయుడు, మౌలాలి, పవన్, వాసు, రాజేష్, నవీన్, కాజా, ప్రణయ్, అనిల్, ప్రసాద్, దివాకర్, సురేష్, రాజేష్, ప్రసాద్, మధు ప్రేమ్, రామ్, సురేంద్ర, శివ, హుస్సేన్, రామకృష్ణ, శివాజీ తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


సంక్షేమ పథకాల పాంప్లెట్లను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

మరోసారి అవకాశమ్మివ్వండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - అవుకు : త్వరలో జరిగే ఎన్నికల్లో మరోసారి అవకాశం ఇచ్చి తనను గెలిపిస్తే అవుకు మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి పరుస్తానని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. శనివారం అవుకు పట్టణంలోని భూలక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆ తర్వాత ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపు జరిగే ఎన్నికల్లో వైసిపిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్రెడ్డి, మాజీ సర్పంచ్ దుగ్గిరెడ్డి రవీంద్రారెడ్డి, యువ నాయకులు చల్లా విక్రాంత్ రెడ్డి, వాయునందన గౌడ్, కాసుల నారాయణ, మామిళ్ల సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను వినియోగించుకోండి

ప్రజాశక్తి - రుద్రవరం : ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెద్ద కంబలురు పంచాయతీ కార్యదర్శి షాహినూర్ తెలిపారు. శనివారం సచివాలయ పరిధిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ శివాని, డాక్టర్ శివ మోహన్ ఆధ్వర్యంలో 407 మందికి వైద్య సేవలు అందించామన్నారు. వీరిలో ముగ్గురిని న్యూరాలజీ వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య సేవ నిమిత్తం ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సచివాలయ సిబ్బంది, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

నారా భువనేశ్వరికి చీర, సారెతో సత్కారం

ప్రజాశక్తి - నంద్యాల రూరల్ : టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వర్‌కి, నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరికి ఎపి బ్రాహ్మణ సంక్షేమ సమాక్య ఆధ్వర్యంలో పసుపు కుంకుమ చీర సారె పెట్టి సత్కరించారు. అధ్యక్షులు వెంకటరామరాజు, రాష్ట్ర కార్యదర్శి నగరడోణ సుధీర్, కార్యవర్గ సభ్యులు, మనోహర్, జ్యోతి, మల్లిక, సాయి, రమ్య, శైలజ, రఘురామ శర్మ, మాధురి తదితరులు పాల్గొనారు.


నారా భువనేశ్వర్‌కి, బైరెడ్డి శబరికి పసుపు కుంకుమ,చీర ,సారె పెడుతున్న దృశ్యం